గురువారం
13-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 112
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కమ్యూనిస్టు యోధ వంక
10లో
జవం జీవం
పార్టీ, పేదలే
ఎల్డీఎఫ్ కోసం
సీఎం పదవిని
వదులుకున్న పీకేవీ

సీపీఐ జాతీయ మహాసభల విజయాన్ని కాంక్షిస్తూ నెల్లూరు నగరంలో యువ కమ్యూనిస్టుల భారీ బైక్ ర్యాలీ

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికశక్తులు ఏకం కావాలి

- ప్రాంతీయ పార్టీలే కీలకం
- జాతీయ మహాసభల్లో ముసాయిదా తీర్మానం
- అన్ని రంగాల్లో కేంద్రం వైఫల్యం
- రాష్ట్రాల హక్కులు హరిస్తున్న మోదీ
- పెరిగిన నిరుద్యోగం, అసమానతలు
- అంబానీ, అదానీకి ఊడిగం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజా పక్కన అతుల్‌కుమార్ అంజన్, పల్లవ్‌సేన్ గుప్తా, నారాయణ, రామకృష్ణ, ముప్పాళ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశాన్ని అధోగతి పాల్జేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలు, లౌకిక శక్తులు ఐక్యం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. బీజేపీని గద్దెదించడంలో ప్రాంతీయ పార్టీలు ప్రధాన భూమిక పోషించాలని కోరారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోందని, దేశాన్ని సర్వనాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. మోదీ సర్కారును గద్దె దించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని ప్రజానీకానికి ఆయన విజ్ఞప్తి చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14 నుంచి 18వరకు విజయవాడ కేంద్రంగా జరగనున్న మహాసభల్లో దేశ రాజకీయాలను మార్చేలా, బీజేపీకి ప్రత్యామ్నాయం చూపడమే ప్రధాన అజెండాగా చర్చిస్తామని రాజా వివరించారు. మహాసభలకు దేశ, విదేశీ ప్రతినిధులతోపాటు వామపక్ష పార్టీల నేతలను ఆహ్వానించామన్నారు. మహాసభల విజయవంతానికి పార్టీ జాతీయ కార్యదర్శి, ఆహ్వానసంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో విశేష కృషి చేయడాన్ని ఆయన అభినందించారు. అవిశ్రాంతంగా శ్రమిస్తున్న పార్టీ శ్రేణులకు ఆయన జేజేలు పలికారు. సీపీఐ 1925లో ఏర్పడిందని, అప్పటి నుంచి లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో

- మిగతా 2 లో

పైసా ఖర్చులేకుండా

- పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు
- విద్యుత్ సంస్థలే బిగిస్తాయి
- బొగ్గు కొరత లేకుండా చూడండి
- ఇంధన శాఖ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ పంపిణీ అత్యంత పారదర్శకంగా, నాణ్యంగా, రైతులకు మేలు చేసేదిగా ఉండాలని, రైతులకు పైసా ఖర్చు లేకుండా విద్యుత్ సంస్థలే మోటార్లు బిగిస్తాయని సీఎం జగన్ వెల్లడించారు. ఇంధన శాఖపై క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష

- మిగతా 2 లో

చమురు సంస్థలకు రూ.22 వేల కోట్లు

- ఎల్‌పీజీ నష్టాలు తగ్గించడానికే
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్
- బహుళ రాష్ట్రాల సహకార చట్ట సవరణకు ఆమోదం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎల్‌పీజీ నష్టాలను అధిగమించేందుకు ప్రభుత్వ చమురు రంగ కంపెనీలకు రూ.22 వేల కోట్ల నిధి మంజూరుతో పాటు రైల్వే ఉద్యోగులకు దీపావళి బోనస్ ప్రకటించింది. మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీల చట్ట సవరణకు ఆమోదం తెలిపింది. రెండేళ్లలో దేశీయ వంట గ్యాస్ ఎల్‌పీజీని తక్కువ ధరకు విక్రయించడం వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రభుత్వ రంగంలోని మూడు ఇంధన రిటైలర్లకు రూ.22 వేల కోట్లను ప్రభుత్వం వన్-టైమ్ గ్రాంట్‌గా మంజూరు చేస్తుందని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కంపెనీలకు ఒకేసారి నిధి మంజూరుకు ఆమోదం తెలిపినట్లు మంత్రి ఠాకూర్ వివరించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2020 జూన్ నుంచి 2022 జూన్ వరకు వినియోగదారులకు వంట గ్యాస్‌ను తక్కువ ధరకు విక్రయించడం వల్ల కలిగిన నష్టాన్ని

- మిగతా 2 లో

లక్ష్మణ రేఖ ఉన్నా...

పెద్దనోట్ల రద్దుపై విచారిస్తాం

- జ్యుడిషియల్ సమీక్ష తర్వాత నిర్ణయం
- 9కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దుపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసును విచారించి తీరుతామని స్పష్టంచేసింది. కేంద్రప్రభుత్వ విధానపర నిర్ణయాలపై జ్యుడిషియల్ సమీక్షకు సంబంధించి లక్ష్మణరేఖపై అవగాహన ఉన్నప్పటికీ 2016 నోట్ల రద్దును పరిశీలించిన తర్వాతే దానిపై తగిన నిర్ణయం తీసుకోగలమని సుప్రీంకోర్టు బుధవారం వెల్లడించింది. జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. ఏదేని విషయం రాజ్యాంగ ధర్మాసనం దృష్టికి వచ్చాక దానిపై సమాధానం ఇవ్వడం విధి ధర్మమని పేర్కొంది. నోట్ల రద్దు చట్టాన్ని తగిన విధంగా సవాల్ చేయనంత వరకు అది 'అకడమిక్' కసరత్తుగానే ఉంటుందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. పెద్దనోట్ల రద్దు చట్టం 1978లో అమల్లోకి వచ్చింది. ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందన్నప్పుడు, అక్రమ నగదు బదిలీని కట్టడి చేసేందుకు పెద్దనోట్లను రద్దు చేసేందుకు ఈ చట్టం దోహదపడుతుంది. ఈ చట్టం కేవలం అకడమిక్ కసరత్తు అవునా.. కాదా... అన్నది నిర్ధారించేందుకు జ్యుడిషియల్ సమీక్ష అవసరమని తెలిపింది. ప్రభుత్వ విధానం, దాని విజ్ఞతను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించింది. 'లక్ష్మణ రేఖ ఎక్కడున్నదో మాకు తెలుసు. అది అమలు అయిన తీరును పరిశీలించాల్సి ఉంది. వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకోగలుగుతాం' అని ధర్మాసనం వెల్లడించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. అకడమిక్ వ్యవహారాలపై కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. మెహతా వాదనలపై పిటిషనర్ తరపున వివేక్ నారాయణ్ శర్మ తరపు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ ధర్మాసనం సమయాన్ని వృథా చేయడం అన్న వ్యాఖ్యలు ఆశ్చర్యకరమన్నారు. ఇటువంటి కేసులు రాజ్యాంగ ధర్మాసనం దృష్టికి రావాలన్నారు. ప్రతివాదుల్లో ఒకరి పక్షాన సీనియర్ న్యాయవాది పి.చిదంబరం వాదనలు వినిపించారు. ఇది అకడమిక్ వ్యవహారం కాదని, దీనిపై కోర్టు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇటువంటి పెద్దనోట్ల రద్దునకు పార్లమెంటులో వేరొక చట్టం అవసరమని అన్నారు. ఈ కేసులో తదుపరి విచారణను నవంబరు 9వ తేదీకి వాయిదా వేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 డిసెంబరు 16న ఇదే వ్యవహారం విచారణకు రాగా ఈ నిర్ణయం చట్టబద్ధతపై ప్రశ్నలకు తదితర నిర్ణయాలకు సంబంధించిన అంశాలను ఐదుగురు సభ్యుల న్యాయస్థానానికి అప్పటి ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ సిఫార్సు చేసిన విషయం విదితమే.

ఇదీ లోకం!

అనంత జలమయం

- నీట మునిగిన నగర రహదారులు... గృహాలు
- కోట్ల రూపాయల నష్టం... నిరాశ్రయులైన ప్రజలు
- సహాయక చర్యల్లో అధికారులు... ప్రజాప్రతినిధులు
- వాగులు, వంకల ఆక్రమణతోనే కష్టాలు
- సర్వం కోల్పోయామంటూ బాధితులు లబోదిబో

2లో

సీపీఐ 24వ జాతీయ మహాసభలకు ప్రతినిధులుగా వచ్చిన బంగ్లాదేశ్ కమ్యూనిస్టు నాయకులకు గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న జమిందార్, వాసు వల్లూరి, సుబ్బారావు, రెడ్ షర్ట్ వలంటీర్లు.

20వ సీపీసీ మహాసభలకు చైనా సిద్ధం



బీజింగ్: చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ) 20వ మహాసభలకు బీజింగ్ నగరం అంగరంగ వైభవంగా ముస్తాబైంది. కోవిడ్ ఆంక్షలు, భద్రతాపరమైన చర్యలతో పాటూ నగరంలో ఎక్కడ చూసినా అరుణ పతాకాలు, రాజకీయ బ్యానర్లు రెపరుపలాడుతున్నాయి. ప్రతి ఐదేళ్ళకోసారి జరిగే ఈ మహాసభలు ఈ నెల 16న ప్రారంభమై 23తో ముగుస్తాయి. ఈ మహాసభల్లో మావో జెడాంగ్ తర్వాత అధ్యక్షుడు జిన్‌పింగ్ అత్యంత శక్తివంతమైన నేతగా ఆవిర్భవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతం సాంప్రదాయాలకు భిన్నంగా వరుసగా మూడోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా జిన్‌పింగ్ బాధ్యతలుచేపట్టే అవకాశం ఉంది. ఈ సమావేశాలకు 2300మంది పార్టీ సభ్యులు హాజరు కానున్నారు. తియాన్మిన్ స్క్వేర్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరిగే ఈ మహాసభల నిర్వహణ కోసం అదనపు భద్రతా సిబ్బందిని రంగంలో దించారు. విశిష్ట వ్యక్తులపై 24గంటలూ నిఘా వుంచేందుకు 42మంది గార్డులను నియమించారు. రాజకీయంగా కీలకంగాజరుగనున్న ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడానికి అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) 19వ కేంద్ర కమిటీ బుధవారం బీజింగ్‌లో ఏడవ ప్లీనరీ సమావేశాన్ని ముగించింది. ఈ సమావేశం అక్టోబర్ 9న బీజింగ్‌లో ప్రారంభమైంది, ఈ సమావేశానికి 199 మంది పూర్తి కాల సభ్యులు,159 మంది ప్రత్యామ్నాయ సభ్యులు హాజరయ్యారు. సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో అధ్యక్షతన జరిగిన నాలుగు రోజుల సెషన్‌లో సీపీసీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్ ప్రధాన ప్రసంగం చేశారు. 20వ సీపీసీ జాతీయ కాంగ్రెస్‌ను అక్టోబర్ 16న బీజింగ్‌లో ప్రారంభించాలని ఈ ప్లీనరీ సమావేశంలో నిర్ణయించారు. ఈ నేపధ్యంలో సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో సీపీసీ ప్లీనరీకి నివేదికను అందించారు.

అమెరికా ఆరోగ్య భద్రతా వ్యవస్థ విఫలం

న్యూయార్క్: జనాభాలో దాదాపు సగం మంది(44 శాతం), దాదాపు 114 మిలియన్ల మంది అమెరికన్లు, దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఘోరంగా విఫలమైందని వ్యాఖ్యానించారు. వెస్ట్ హెల్త్ గ్యాలప్ అనే పోలింగ్ సంస్థ నివేదిక ఆధారంగా ఆరోగ్యసంరక్షణపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. దేశంలోని దాదాపు 40 శాతం మంది పురుషులు, 43 శాతం మంది శ్వేత, నల్లజాతి అమెరికన్లు ఆరోగ్య సంరక్షణ విధానానికి డీ లేదా ఈ గ్రేడ్‌ను కేటాయించారు.

యూరప్‌కు గ్యాస్ సరఫరా పునరుద్ధరణకు సిద్ధం : పుతిన్

మాస్కో : జర్మనీకి వెళ్లే నార్డ్ స్ట్రీమ్ 2 పైప్‌లైన్ లింక్ ద్వారా యూరప్‌కు గ్యాస్ సరఫరా పునరుద్ధరణకు తాము సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం తెలిపారు. మాస్కో ఎనర్జీ ఫోరమ్‌లో మాట్లాడుతూ నార్డ్ స్ట్రీమ్-1 పైప్‌లైన్ రెండు లింక్‌లు, నార్డ్ స్ట్రీమ్-2 పైప్‌లైన్ రెండు లింకుల్లో భారీ గ్యాస్ లీక్‌కు కారణమైన పేలుళ్ల వెనుక అమెరికా హస్తం ఉందని పుతిన్ ఆరోపించారు. ఈ ఆరోపణలను అమెరికా గతంలో ఖండించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో యూరోపియన్ దేశాలకు రష్యా గ్యాస్ సరఫరాను తగ్గించింది. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఐఏఈఏ చీఫ్ రాఫెల్ గ్రాస్సీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన భేటీలో జపోరిజ్జియా అణువిద్యుత్ ప్లాంట్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అణు ప్రమాదాన్ని నివారణపై చర్చలుజరిగాయి. అణు ప్రమాదం జరిగే ఆయా ప్రాంతాల్లో చాలా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ భేటీకి సంబంధించి క్రెమ్లిన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత కాలంలో ఇంధన సమస్యలు, గ్లోబల్ వార్మింగ్, అనేక అంశాలు అణుశక్తికి సంబంధించి వర్తమానం, భవిష్యత్‌లో అణుశక్తి పాత్ర ఎలా ఉండవచ్చనే విషయాన్ని గ్రాస్సీ హైలెట్ చేశారని, రష్యా ఎల్లప్పుడూ ఏజెన్సీకి మద్దతు ఇస్తుందని క్రెమ్లిన్ పేర్కొంది.

కువైట్‌లో భారత నూతన రాయబారి ఆదర్శ్

న్యూదిల్లీ : గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న కువైట్‌లో భారత్ నూతన రాయబారిగా సీనియర్ దౌత్యవేత్త ఆదర్శ్ స్వాయికా బుధవారం నియమితులయ్యారు. స్వాయికా 2002 బ్యాచ్‌కి చెందిన భారత విదేశీ సేవల అధికారి. ప్రస్తుతం ఆయన దిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) కేంద్ర కార్యాలయంలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. కువైట్ నూతన రాయబారిగా ఆయన త్వరలోనే బాధ్యతలు చేపడతారని ఎంఇఎ ప్రకటించింది.

డబ్ల్యుహెచ్‌ఓ నివేదికపై ప్రభుత్వ ప్యానెల్

న్యూదిల్లీ : భారత్‌లో తయారైన నాలుగు రకాల దగ్గు సిరప్‌ల కారణంగా గాంబియాలో 66 మంది పిల్లల మరణాలపై డబ్ల్యుహెచ్‌ఓ నివేదికను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం బుధవారం నలుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ నివేదికను పూర్తిగా పరిశీలించి విశ్లేషించిన తర్వాత ఈ కమిటీ.. తదుపరి చర్యలు ఏం తీసుకోవాలనే విషయాన్ని భారత ఔషధ నియంత్రణ సంస్థ (డిజిసిఐ)కి తెలియజేయనుంది. సోనేపట్‌లోని మైడెన్ ఫార్మాసుటికల్స్‌లో ఔషధ తయారీని నిలిపివేయాలని హరియాణా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన రోజునే ఈ కమిటీ కూడా నియమితమైంది.

ఫేక్ వార్తలను గుర్తించడం ఎలా ?

కేరళ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

తిరువనంతపురం: సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న పోస్టింగుల్లో ఏవి నిజం, ఏవి అబద్ధమో గుర్తించడం కష్టతరంగా మారింది. దేశవ్యాప్తంగా మితవాదశక్తులు విచ్చలవిడిగా సామాజిక మాధ్యమాల ద్వారా అబద్ధాలను, నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తూ సమాజం విచ్ఛిన్నానికి చేస్తున్న ప్రయత్నాలకు చెక్ పెట్టాలని భావించిన కేరళలోని వామపక్ష ప్రభుత్వం...అందుకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. తప్పుడు వార్తల ప్రభావం నుంచి తమ విద్యార్థులను కాపాడుకునే ఉద్దేశంతో రెండేళ్ల క్రితమే కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (క్రైట్) ద్వారా ఫేక్ వార్తలను గుర్తించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడు దశల్లో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమం ఆగస్టులో పూర్తయినట్టు ప్రాథమిక విద్యాశాఖ మంత్రి వి.శివన్ కుట్టి తెలిపారు. మూడు దశల్లో ఇప్పటికే మొత్తం 19.72 లక్షల మందికి శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. సత్యమేవ జయతే డిజిటల్ లిటరసీ ప్రోగ్రాం కింద పనిచేస్తున్న 5,920 మంది శిక్షకులు మూడుదశల్లో 9.48 లక్షల మంది అప్పర్ ప్రైమరీ, 10.24 లక్షల మంది హైస్కూల్ విద్యార్థులకు శిక్షణ పూర్తి చేసినట్టు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు సామాజిక మాధ్యమాలపై అవగాహన, ఫేక్‌న్యూస్ ఎలా గుర్తించాలి, ఎలా నిలువరించాలి అనే అంశాలపై శిక్షణ అందించినట్టు చెప్పారు. ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ మీడియాను ఎలా వినియోగించుకోవాలి, సామాజిక మాధ్యమాల్లో చేయకూడని పనులపైనా విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తల గుర్తింపు, ఏవి నిజం, ఏవి అబద్ధం, తప్పుడు వార్తలు వైరల్ కాకుండా నిరోధించే నైపుణ్యాలపై ప్రతి విద్యార్థికి 2.30 నిముషాల సమయాన్ని కేటాయించి శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినట్టు వివరించారు.

నమోదవకుంటే మదర్సాలను మూసివేస్తాం

డెహ్రాడూన్: ఒక నెలలోగా మదర్సాలు రాష్ట్ర విద్యా శాఖలో నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో మూసివేయాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో దాదాపు 400 నమోదుకాని మదర్సాలు ఉన్నాయి. ఒక నెలలోపు రాష్ట్ర విద్యా శాఖలో నమోదు చేసుకోవాలని మదర్సాలకు గడువు విధించాం... విఫలమైతే, వాటిని మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని ఉత్తరాఖండ్ సాంఘిక సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి చందన్ రామ్ దాస్ తెలిపారు. ప్రస్తుతం, 419 మదర్సాలు ఉత్తరాఖండ్ మదర్సా బోర్డులో నమోదు కాగా, వీటిలో 192 మదర్సాలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం నమోదుకాని మదర్సాలు దాదాపు 400 వరకు ఉన్నాయి. 'రాష్ట్ర విద్యా శాఖలో నమోదు చేసుకోకపోవడం అక్కడ చదివే విద్యార్థుల భవిష్యత్తుకు హాని కలిగిస్తుంది, ఎందుకంటే వారు 5వ తరగతి తర్వాత అడ్మిషన్లు పొందడంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు' అని దాస్ అన్నారు. విద్యాశాఖలో నమోదైతేనే ఆయా మదర్సాలలో చదివే విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందగలరని ఆయన తెలిపారు. మదర్సాలకు మంజూరు చేసిన గ్రాంట్లను సక్రమంగా వినియోగించడం లేదనే ఆరోపణలు రావడంతో, వాటిని సర్వే చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పుష్కర సింగ్ ధామి ఇటీవల పేర్కొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షాదాబ్ షమ్స్ మాట్లాడుతూ... ఈ విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడామని, త్వరలో మదర్సాల సర్వేకు కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అనంత జలమయం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : భారీ వర్షాలకు అనంతపురం నగరం జలమయమైంది. రహదారులు, గృహాలు నీట మునిగాయి. ప్రజలు ఇళ్లలో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వం కోల్పోయి తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాలకు నగరంలోని అనేక కాలనీలు జలమయం అయ్యాయి. నడిమివంకకు రెండువైపులా ఉన్న ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరుకుంది. దీంతో బుధవారం ఉదయం నుంచే అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వరద సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. అధికారులు, పోలీసులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తున్నారు. రంగస్వామినగర్, రజక నగర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నడుము లోతు నీళ్లలోనే ప్రజల వద్దకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితులను ప్రత్యేకంగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడ వారికి అవసరమైన భోజన సదుపాయాలను కల్పించారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరి, దుర్గాదేవి, శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఇసాక్, మునిశేఖర్, వైసీపీ నేతలు రామచంద్ర, దాదు తదితరులు ప్రజలను ఇళ్లలోంచి బయటకు తీసుకువచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ప్రాంతాల నుంచి పోలీసుల సాయంతో తాడు ఏర్పాటు చేసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రుద్రంపేట వంక సమీపంలోని ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించి ఇరుక్కుపోయిన మహిళలను నాల్గవ పట్టణ పోలీసులు సురక్షితంగా తరలించారు. వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సీఐ జాకీర్ హుస్సేన్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి రెండు పొడవైన తాటి దుంగలను తెప్పించి వారు ఆ వంక దాటేలా ఏర్పాటు చేయించారు. సీఐ, ఆయన సిబ్బంది ఇళ్లల్లో ఇరుక్కుపోయిన వృద్ధ మహిళలను ఎత్తుకొని వచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లా కేంద్రంలోని 5, 6వ రోడ్లు, శివారు ప్రాంతమైన కైలాసం రోడ్డులో వరద ఉధృతికి చిక్కుకున్న దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతున్న వృద్ధుడిని, పసి పాప, మరి కొందరు మహిళలను ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, త్రీటౌన్ ఎస్ఐ వలీబాషా అధ్వర్యంలో పోలీసులు సురక్షితంగా తరలించారు. వృద్ధుడు కనీసం లేచి కూర్చోలేని స్థితి కావడంతో మంచంపై పడుకోబెట్టి ఎస్ఐ అధ్వర్యంలో పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సంయుక్తంగా ఎత్తుకొచ్చి సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్లాయి.

30 మంది హాస్టల్ విద్యార్థుల తరలింపు

వరద నీటిలో చిక్కుకున్న 30 మంది హాస్టల్ విద్యార్థులను నాల్గవ పట్టణ పోలీసులు సురక్షితంగా తరలించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో స్థానిక వికలాంగుల కొట్టాలలోని శ్రీరామకృష్ణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 30 మంది చిక్కుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ జాకీర్ హుస్సేన్, తన సిబ్బందితో కలసి అక్కడికి వెళ్లి ఆ పాఠశాలకు చెందిన బస్సు ద్వారానే 30 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతోపాటు విశ్వశాంతి నగర్‌లోని ఒక ఇంట్లో చిక్కుకున్న ఇద్దరు వృద్ధులను, ఆరు బర్రెలను సురక్షితంగా చేర్చారు. అనంతపురం నగరంలోని 47వ డివిజన్, రంగస్వామి నగర్‌లో, అలాగే జిల్లాలో నీట మునిగిన ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్డీవో మధుసూదన్, మునిసిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, అగ్నిమాపక విభాగం అధికారులు, ఇతర అధికారులు పరిశీలించగా బాధితులకు మెరుగైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

అడ్డూఅదుపూలేని ఆక్రమణలతోనే వరద ముంపు

వంకలు, వాగులు కనిపిస్తే చాలు రియల్టర్లు అక్కడ గద్దల్లా వాలిపోయి పక్కనే ఉన్న ప్రైవేటు భూమిని కొనుగోలు చేయడం వంక, వాగులు ఆక్రమించుకోవడం, ప్లాట్లు వేసి విక్రయాలు చేయడం అనంతపురం జిల్లాలో సర్వసాధారణమైపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులు, గృహాలు జలమయమై, కోట్ల రూపాయల నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని అనంతపురం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు

అనంతపురం జిల్లా కేంద్రం నీట మునిగింది. యదేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీనిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల పెద్ద ఎత్తున ఆస్తి నష్టాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అనంతపురంలో ప్రధాన రహదారులు నదులను తలపిస్తున్నాయి. గత 50 సంవత్సరాల కాలంలో ఇంత పెద్ద వర్షం అనంతపురం, సత్యసాయి జిల్లాల ప్రజలు చూడలేదు. కాగా కరువు కోరల్లో కొట్టుమిట్టాడుకొనే ఈ ప్రాంతంలో వాగులు, వంకలు పెద్దగా ప్రవహించకపోవడంతో రియల్టర్లకు, అధికారులకు అవి మంచి ఆదాయ వనరులుగా మారిపోయాయి. ఆక్రమణలను అరికట్టవలసిన అధికారులే వాటిని ప్రోత్సహించడంతో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండాపోయి నేడు అవి అనువైన ప్రాంతాలుగా మారిపోయాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అప్పటివరకు పిల్లల్ని స్కూలుకు పంపేదిలేదు

తమిళనాడులో తల్లిదండ్రుల నిరసన

ఈరోడ్: కనీస సౌకర్యాలు, సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులు లేకుండా తమ పిల్లల్ని పాఠశాలకు పంపేది లేదని తల్లిదండ్రులు భీష్మించారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా కూనన్‌పురంలో క100 మందికి పైగా విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తమ పిల్లలను పంపేందుకు నిరాకరించారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 142 మంది విద్యార్థుల్లో హాస్టల్‌లో ఉంటున్న ఎనిమిది మంది మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. పనహళ్లి, పాళయం, జెరహళ్లి, ఈరనహళ్లితో పాటు మరికొన్ని ప్రాంతాలకు చెందిన 134 మంది విద్యార్థులు పాఠశాలకు రాలేదు. ఈ పాఠశాలలో పనిచేసే ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒక ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక మెడికల్ లీవ్‌లో ఉన్నారని, మరో ఉపాధ్యాయుడు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయునిగా ఉంటూ తరచూ అధికారిక పనిపై పాఠశాలకు దూరంగా ఉంటున్నారని తల్లిదండ్రులు తెలిపారు. 6వ తరగతి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులందరికీ ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, త్రైమాసిక పరీక్షలో ఒక్క విద్యార్థి కూడా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేదని చెప్పారు. పాఠశాలలో 68 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి ఉందని, దానిని నిర్వహించడానికి సిబ్బంది లేరని, పాఠశాలను పునరుద్ధరించిన తరువాత అదనపు తరగతి గదులు నిర్మించలేదని చెప్పారు.

ఈ సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగానికి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో తమ పిల్లలకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులను నియమించే వరకు, మా పిల్లల్ని పాఠశాలకు పంపబోమని వారు స్పష్టం చేశారు.

చత్తీస్‌గఢ్‌లో ఈడీ దాడులు

రూ.4 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. మొత్తం రూ.4కోట్ల నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కొందరు ప్రభుత్వ అధికారులు ప్రైవేటు రవాణా సంస్థల నుంచి కమీషన్లు పొందుతున్న ఆరోపణలపై ఆదాయపు పన్ను శాఖ ఫిర్యాదుమేరకు నమోదైన మనీలాండరింగ్ కేసుల క్రమంలో ఈడీ తనిఖీలు చేపట్టింది. రాజధాని రాయ్‌పూర్‌తో పాటు రాయ్‌గఢ్, మహాసముంద్, కోర్బా తదితర జిల్లాల్లో దాడులు నిర్వహించింది. ముగ్గురు ఐఏఎస్‌లు, వ్యాపారవేత్త సూర్యకాంత్ తివారీ, మాజీ ఎమ్మెల్యే అగ్ని చంద్రకర్‌తో సహా అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఇళ్లను సోదా చేసింది.

బెదించేందుకే...: సీఎం

కాంగ్రెస్ పార్టీతో ప్రత్యక్ష పోరాటం చేయలేని బీజేపీ ఈడీ, ఆదాయపు పన్ను (ఐటీ), రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం (డీఆర్ఐ) తదితర సంస్థలతో దాడులు చేయించి బెదిరింపులకు దిగుతోందని ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు మళ్లీ మళ్లీ జరుగుతూనే ఉంటాయన్నారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ దర్యాప్తు సంస్థలు దూకుడు పెంచుతాయని విమర్శించారు.

రూ.22 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పూడ్చేందుకు ఈ నిధిని మంజూరు చేస్తుందన్నారు. ఈ మూడు సంస్థలు దేశీయ వంట గ్యాస్‌ను వినియోగదారులకు ప్రభుత్వ నియంత్రిత ధరలకు విక్రయిస్తున్నాయి. 2020 జూన్ నుంచి 2022 జూన్ మధ్య ఎల్‌పీజీ అంతర్జాతీయ ధరలు దాదాపు 300 శాతం పెరిగాయి. అయితే అంతర్జాతీయ ఎల్‌పీజీ ధరలలో హెచ్చుతగ్గుల నుంచి వినియోగదారులను నిరోధించేందుకు ఖర్చు పెరుగుదల పూర్తిగా దేశీయ ఎల్‌పీజీ వినియోగదారులకు బదిలీ చేయబడదని మంత్రి తెలిపారు. దీని ప్రకారం ఈ కాలంలో దేశీయ ఎల్‌పీజీ ధరలు కేవలం 72 శాతం మాత్రమే పెరిగాయని, ఇది మూడు సంస్థలకు గణనీయమైన నష్టాలకు దారితీసిందని పేర్కొన్నారు. 'నష్టాలు ఉన్నప్పటికీ మూడు పీఎస్‌యూలు దేశంలో అవసరమైన వంట గ్యాస్ నిరంతర సరఫరాను నిర్ధారించాయి. దేశీయ ఎల్‌పీజీల్లో నష్టాలను పూడ్చుకునేందుకు ఈ మూడు పీఎస్‌యూలకు వన్-టైమ్ గ్రాంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది' అని మంత్రి వివరించారు. దేశీయ ఎల్‌పీజీ సరఫరాలకు అడ్డంకులు లేకుండా భరోసాగా, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌కు తమ నిబద్ధతను కొనసాగించేందుకు ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు ఈ నిర్ణయం సహాయపడుతుందని, దేశీయ తయారీ ఉత్పత్తుల సేకరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగులకు ఉత్పాదక అనుసంధాన బోనస్

కేంద్ర ప్రభుత్వం లక్షలాది రైల్వే ఉద్యోగులకు దీపావళి బొనాంజాను ప్రకటించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రైల్వే ఉద్యోగులకు 78 రోజులకు సమానమైన ఉత్పాదక అనుసంధాన బోనస్ (పీఎల్‌బీ) చెల్లింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అర్హులైన రైల్వే ఉద్యోగులకు పీఎల్‌బీ చెల్లింపు ప్రతి సంవత్సరం దసరా/పూజ సెలవులకు ముందు ఉంటుంది. ఈ ఏడాది కూడా దాదాపు 11.27 లక్షల మంది నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన పీఎల్‌బీ మొత్తాన్ని చెల్లిస్తారు. అర్హత ఉన్న రైల్వే ఉద్యోగికి 78 రోజులకు చెల్లించాల్సిన గరిష్ఠ మొత్తం రూ.17,951గా ఉంది. ట్రాక్ మెయింటెయినర్లు, డ్రైవర్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, కంట్రోలర్లు, పాయింట్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్-సి సిబ్బందితో సహా వివిధ వర్గాలకు పై మొత్తం చెల్లిస్తారు. కోవిడ్ అనంతర సవాళ్ల కారణంగా ప్రతికూల ఆర్థిక పరిస్థితి ఏర్పడినప్పటికీ పీఎల్‌బీ చెల్లింపు కోసం పై నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. నిర్వచించిన ఫార్ములాల ఆధారంగా పని చేసిన రోజుల కంటే అసలు చెల్లించిన పీఎల్‌బీ రోజుల సంఖ్య ఎక్కువ అని పేర్కొంది. రైల్వే పని తీరును మెరుగుపరిచేందుకు, ఉద్యోగులను ప్రోత్సహించేందుకు పీఎల్‌బీ చెల్లింపు ఉపయోగపడుతుందని వివరించింది.

మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీల చట్ట సవరణకు ఆమోదం

మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీలు (సవరణ) బిల్లు-2022కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీల చట్టం-2002కు సవరణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరిచేందుకు సవరణలు తీసుకొచ్చామని చెప్పారు. 97వ రాజ్యాంగ సవరణలోని నిబంధనలను ఈ బిల్లు పొందుపరచనుంది. పాలనను మెరుగుపరచడం, ఎన్నికల ప్రక్రియను సంస్కరించడం, పర్యవేక్షణ యంత్రాంగాలను బలోపేతం చేయడం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం కోసం సవరణలను తీసుకువచ్చారు. బహుళ-రాష్ట్ర సహకార సంఘాలలో నిధుల సమీకరణకు వీలు కల్పించడంతో పాటు బోర్డు కూర్పును మెరుగుపరచడానికి, ఆర్థిక క్రమశిక్షణను నిర్ధారించడానికి కూడా ఈ బిల్లు ప్రయత్నిస్తుంది.

దీన్‌దయాళ్ పోర్టులో కంటైనర్ టెర్మినల్ అభివృద్ధికి ఆమోదం

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా క్రింద ఉన్న గుజరాత్‌లోని దీన్‌దయాళ్ పోర్టులోని టున-టెక్రా వద్ద కంటైనర్ టెర్మినల్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. రాయితీదారు పక్షాన రూ.4,243.64 కోట్ల అంచనా ఉంటుంది. సాధారణ వినియోగదారు సౌకర్యాల అభివృద్ధికి రూ.296.20 కోట్ల సాధారణ వినియోగదారు సౌకర్యాల అంచనా వ్యయం రాయితీదారుపై ఉంటుంది.

పైసా ఖర్చులేకుండా...

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ అత్యంత మెరుగైన వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో పాటు రైతులకు మీటర్ల వల్లే కలిగే ప్రయోజనాల పై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలన్నారు. రైతుల పేరు చెప్పి దొంగతనంగా విద్యుత్ వాడుతున్న ఘటనలను కూడా దాదాపుగా అడ్డుకోగలుగుతున్నామన్నారు. మీటర్లు పెట్టడం వల్ల రైతులకు ఎంత విద్యుత్ అవసరమో తెలుస్తుందని, దీనివల్ల సరిపడా విద్యుత్‌ను వారికి పంపిణీ చేయడానికి వీలు కలుగుతుందని సూచించారు. వినియోగించుకున్న విద్యుత్‌కు అయ్యే ఖర్చును కూడా నేరుగా రైతుల ఖాతాల్లోకి పంపుతారని, అక్కడి నుంచి ఆ డబ్బు విద్యుత్ పంపిణీ సంస్థలకు చేరుతుందని, దీనివల్ల రైతులకు విద్యుత్ పంపిణీ సంస్థలు జవాబుదారీగా ఉంటాయని, మోటార్లు కాలిపోయినా, నాణ్యమైన విద్యుత్ రాకపోయినా డిస్కంలను రైతు ప్రశ్నించగలుగుతారన్నారు. సీఎం ఆదేశాల మేరకు గతంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. దీనిపై సీఎం మాట్లాడుతూ బొగ్గు నిల్వలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని, వేసవి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టుకునేందుకు ఇప్పటికే 16,63,705 మంది రైతులు అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో పంపు స్టోరేజీ ప్రాజెక్టుల ప్రగతిపై సీఎం జగన్ సమీక్షించారు. పంపు స్టోరేజీ ప్రాజెక్టుల వల్ల రాష్ట్రానికి చక్కటి ప్రయోజనాలున్నాయని, ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన వారికి, అసైన్డ్ భూములున్న వారికి ఏడాదికి ఎకరాకు రూ.30 వేల చొప్పున ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులను పెడతామంటూ ప్రభుత్వానికి రెవెన్యూ కంపెనీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, విశాఖపట్నం, కాకినాడ పోర్టులకు సమీపంలో పెట్టేందుకు ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు. పోలవరం విద్యుత్ ప్రాజెక్టులో నిర్మాణ పనుల ప్రగతిని అధికారులు సీఎంకు వివరించారు. అప్పర్ సీలేరులో 1,350 మెగావాట్ల ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పూర్తయిందని, టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఈ సమీక్షలో విద్యుత్, అటవీ, పర్యావరణం, భూగర్భ గనులు, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ఏపీ జెన్‌కో ఎండీ బి.శ్రీధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొట్కాపుర కాల్పుల కేసులో బాదల్‌ను ప్రశ్నించిన సిట్

చండీగఢ్ : పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌ను 2015 నాటి కొట్కాపుర పోలీసు కాల్పుల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారించింది. రాష్ట్ర అదనపు డీజీపీ ఎల్‌లే యాదవ్ నేతృత్వంలోని ఈ బృందం బుధవారం బాదల్ నివాసానికి వెళ్లి ఆయనను మూడు గంటల పాటు ప్రశ్నించింది.

కొట్కాపుర పోలీసు కాల్పులప్పుడు పంజాబ్ సీఎంగా బాదల్ ఉన్నారు. అలాగే, అదే ఏడాది జరిగిన బెహబల్ కలాన్ పోలీసు కాల్పుల ఘటనపై శిరోమణి అకాలీదళ్ అధినేత, నాటి ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను కూడా సెప్టెంబరు 14న మరో సిట్ బృందం విచారించింది.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు సాగుతూ, ప్రజల తరపున రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. బీజేపీ-ఆరెస్సెస్ మతోన్మాద పోకడలతో దేశానికి తీవ్ర ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రాజ్యాంగ వ్యవస్థలను మోదీ విచ్ఛిన్నం చేస్తూ బహుళజాతి కంపెనీలకు ఊడిగం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రైవేటీకరణ విధానాలతో ప్రభుత్వ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నారని, లాభాల్లో ఉన్న సంస్థలను సైతం కారుచౌకగా అమ్మేస్తూ కార్మికులను బజారు పాల్జేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు దేశంలో అధికంగా ఉన్నారనీ, వారికి లబ్ధి చేకూర్చే పథకాలనుగానీ, సంక్షేమ కార్యక్రమాలనుగానీ చేపట్టడం లేదని, ఉన్న వాటిని సైతం నీరుగారుస్తోందని విమర్శించారు. మోదీ సర్కారు అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తున్నదని దుయ్యబట్టారు. ద్రవ్యోల్బణం రోజురోజుకూ పెరిగిపోతోందని, రూపాయి మారకపు విలువ రికార్డు స్థాయిలో క్షీణిస్తోందని విశ్లేషించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని, ప్రజల్లో కొనుగోలు శక్తి అడుగంటి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసే అర్హత బీజేపీకి ఏ మాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలు చాలా కీలకంగా మారనున్నాయన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితే తప్ప, దేశానికి రక్షణ లేదని నొక్కిచెప్పారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయని, కొన్ని పార్టీలు బీజేపీకి మద్దతిస్తున్నాయని పేర్కొంటూ ఆ పార్టీలు తమ వైఖరిని పునరాలోచించుకోవాలని రాజా కోరారు. అన్ని ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఆరెస్సెస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు నిర్విరామ పోరాటాలు కొనసాగిస్తున్నాయన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరముందని, జాతీయ మహాసభల్లో బీజేపీకి ప్రత్యామ్నాయం చూపడమే ప్రధాన అజెండాగా చర్చ జరుగుతుందని వివరించారు. ప్రజాస్వామ్యంలో కొత్తగా పార్టీలు పెట్టుకునే హక్కు అందరికీ ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా రాజా బదులిచ్చారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ విధి విధానాలను పరిశీలిస్తున్నామని మరొక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సీపీఐ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు 17 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పల్లవ్‌సేన్ గుప్తా తెలిపారు. రష్యా, చైనా, బంగ్లాదేశ్, క్యూబా, గ్రీస్, ఫ్రాన్స్, టర్కీ, పోర్చుగ్రీస్, నేపాల్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అతుల్‌కుమార్ అంజన్ మాట్లాడుతూ ఈ మహాసభలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతోపాటు భవిష్యత్తు పోరాటాలను రూపొందించుకుంటామన్నారు. మోదీ ప్రభుత్వంపై లోతైన విశ్లేషణ చేస్తూ గద్దె దించే విషయమై మహాసభల్లో విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ మహాసభల సందర్భంగా వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతినిధులు తరలివస్తున్నారన్నారు. ఆహ్వానసంఘం అధ్యక్షుడు కె.నారాయణ మూడు రోజుల నుంచి విజయవాడ కేంద్రంగా ఉంటూ సభల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో ఈ మహాసభలకు ఎనలేని ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బెజవాడలో బ్లేడ్‌బ్యాచ్ ఆడగాలు శృతిమించుతున్నాయి. వీరిబారిన పడి చాలామంది గాయాలపాలవుతున్నారు. మరికొందరు మృత్యువుతో పోరాడి ఓడిపోతున్నారు. అర్ధరాత్రి ఒంటరిగా ప్రయాణించాలంటే వణికిపోతున్నారు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేలోపే అంతా అయిపోతోంది. చీకటిమాటున నక్కి ఒంటరిగా వస్తున్న వారిపై ఒక్క ఉదుటున దాడి చేసి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. డబ్బు ఇవ్వనంటే బ్లేడ్‌తో గాయపరుస్తున్నారు. పోలీసులకు పట్టుబడితే, తమ చేతులు తామే కోసేసుకుని వారికి సైతం ముచ్చెమటలు పట్టిస్తున్నారు. పోలీసులు ఎంత కట్టడి చేస్తున్నా వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి.

బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

అడ్డుకట్ట ఎప్పుడు?

- అర్ధరాత్రి ఒంటరి ప్రయాణికులే లక్ష్యం
- వణుకుతున్న బెజవాడవాసులు
- శాశ్వత నగర బహిష్కరణ చేయాలని డిమాండ్
- ప్రభుత్వం దృష్టిపెట్టాలంటున్న మహిళలు

విశాలాంధ్ర-డిజిటల్: బెజవాడ ప్రజలను బ్లేడ్ బ్యాచ్ వణికిస్తోంది. కమిషనరేట్ పరిధిలోని వన్, టూటౌన్, భవానీపురం, కృష్ణలంక, నెహ్రూనగర్, కృష్ణా కరకట్ట, సూర్యారావుపేట, గవర్నర్‌పేట, చిట్టినగర్, విద్యాధరపురం, కుమ్మరిపాలెం, పాలఫ్యాక్టరీ, కేదారేశ్వరపేట, రామలింగేశ్వర్‌నగర్, పద్మావతిఘాట్, పున్నమిఘాట్, కృష్ణవేణిఘాట్, అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, నున్న, ప్రసాదంపాడు ప్రాంతాల్లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆయా ప్రాంతాలను తమకు అనువుగా చేసుకుని యథేచ్ఛగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పాదచారులు ఒంటరిగా వస్తుండడాన్ని గమనించి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిఘటిస్తే శరీరమంతా గాయపరచి, ఉన్నదంతా దోచుకుపోతున్నారు. వికృతంగా దాడిచేస్తున్నారు. ఏం జరుగుతుందో తేరుకునేలోపే అక్కడి నుంచి మాయమవుతున్నారు. తరచూ ప్రదేశాలను మారుస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారు. ఒకవేళ పోలీసులకు పట్టుబడితే తమ చేతులను తామే కోసుకుని వారిని సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎక్కువగా ఆర్టీసీ బస్టాండ్ రైల్వే ట్రాక్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో చీకటిమాటున దాగి ఉండి ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులనే లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడుతున్నారు. చెడు వ్యసనాలు, అలవాట్లకు బానిసలై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నిర్జీవ ప్రదేశంలో మద్యం మత్తులో జోగుతూ ... జేబులు ఖాళీ కాగానే, అర్ధరాత్రివేళ ఒంటరిగా వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం బ్లేడ్ బ్యాచ్ సభ్యులకు నిత్యకృత్యంగా మారింది. నగదు, బంగారు ఆభరణాలు లాక్కుపోతున్నారు. శిక్షలు అనుభవించినా తిరిగి దౌర్జన్యాలకు దిగడం ప్రజలు, ప్రయాణికులను కలవరపాటుకు గురిచేస్తోంది. కొద్ది నెలల క్రితం కుమ్మరిపాలెం సెంటర్‌లో అర్ధరాత్రి ఆటోడ్రైవర్‌పై, వన్‌టౌన్‌లో నలుగురిపై దాడిచేసి డబ్బుదోచుకుని పరారయ్యారు. రైల్వేస్టేషన్ సమీపంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్, గ్యాంగ్‌మన్‌పై దాడికి తెగబడడం, ఇటీవల కర్నూల్ జిల్లా ఆత్మకూరుకు చెందిన లారీ డ్రైవర్ గూడవల్లి వద్ద నిద్రిస్తుండగా బ్లేడ్ బ్యాచ్ సభ్యులు దాడిచేసి నగదు, సెల్ ఫోన్ ఎత్తుకుపోవడం, పైపుల రోడ్డు వద్ద ఓ బార్‌లో సృష్టించిన వీరంగం, చిట్టినగర్ సొరంగం మార్గంలో చేసిన అలజడి నగరవాసులకు నిద్రలేకుండా చేస్తోంది.

పటిష్ఠ నిఘా... అయినా దాడులు

ఇదిలా ఉండగా, నేర నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినా వీరి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. కట్టడికి నిఘా బృందాలు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నా దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. మూలాలు కనుగొని తల్లిదండ్రులతో సహా కౌన్సెలింగ్ ఇచ్చినా, నిత్యం ఏదో ఓ మూల బ్లేడ్ బ్యాచ్ దోపిడీ వినబడుతూనే ఉంది. 18 నుంచి 20 ఏళ్ల లోపు వారే దాడులకు తెగబడుతున్నారని పోలీసులు చెప్పడం విశేషం. నగరంలో 75 మంది సభ్యులున్నట్టు గుర్తించామనీ, 50 మంది చురుగ్గా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనీ, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ఠ నిఘా విభాగం ఏర్పాటు చేశామని, కొందరిపై రౌడీషీట్లు తెరిచామని చెప్పారు. తల్లిదండ్రులు లేక అనాథలుగా ఉన్న కొందరు, ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన మరి కొందరు చెడు వ్యసనాలకు బానిసలై ఈజీగా డబ్బు సంపాదించవచ్చన్న ఉద్దేశంతోనే నేరాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నగర పోలీసులు, రైల్వే పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నా నేరాలు ఏదోమూల జరుగుతూనే ఉన్నాయి. ఏదిఏమైనా రాజకీయ జోక్యం లేకుండా కఠిన శిక్షలు అమలు చేసి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులను శాశ్వతంగా నగర బహిష్కరణ చేస్తేనే వీరి ఆగడాలను పూర్తిగా అరికట్టవచ్చునని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

బెజవాడలోని చాలా ప్రదేశాల్లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. వీరికి రాజకీయ నేతల అండ మెండుగా ఉంది. పోలీసులు బ్లేడ్‌బ్యాచ్ సభ్యులను స్టేషన్‌కు తీసుకెళ్లినా... స్వార్థపూరిత రాజకీయ నాయకుల జోక్యంతో వీరిని విడిచిపెట్టక తప్పడం లేదు. పార్టీలతో సంబంధం లేకుండా వీరిని అరెస్టు చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలి. శాశ్వతంగా నగర బహిష్కరణ చేయాలి. సంఘ విద్రోహశక్తులను అరికట్టడంలో పోలీసులకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి.

– లింగాబత్తిన శివకుమార్, సీపీఐ నేత, విజయవాడ

కఠిన శిక్షలు విధించాలి

చీకటి పడితే చాలు ఒంటరిగా ఇంటికి వెళ్లాలంటే భయంగా ఉంటుంది. సాధారణ ప్రయాణికుల్లా రోడ్డుపైనే ఉంటారు. పోలీసుల విజిల్ విని చీకట్లోకి జారుకుంటారు. వీరిపై తూతూమంత్రపు కేసులు పెట్టకుండా కఠిన శిక్షలుపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలి. బెజవాడలోనే కనిపించకుండా చూడాలి. కళ్లుగప్పి తిరుగుతుంటే జైల్లోపెట్టి జీవితంలో తప్పు చేయనుబాబోయ్ అనిపించేలా పోలీసు శిక్షలు ఉండాలి. పాలక ప్రభుత్వం తలచుకుంటే నేర ప్రవృత్తిని నిర్మూలించడం పెద్ద కష్టమేమీ కాదు. బ్లేడ్‌బ్యాచ్ తల్లిదండ్రులకు కూడా పిల్లలను అదుపులోపెట్టుకునేలా కౌన్సెలింగ్ ఇస్తే బాగుంటుంది.

– దారపు తులసి, విజయవాడ

ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

608వ రోజుకు విశాఖ ఉక్కు రిలే దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమలను తన తాబేదారులకు కట్టబెట్టడంలో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డీ ఆదినారాయణ విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు బుధవారం 608వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంటైనర్ టెర్మినల్‌ను అదానికి అత్యంత తక్కువ ధరకు అమ్మారని ఆరోపించారు. నేడు వంట గ్యాస్ సిలిండర్ల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పాలక పక్షాలు ప్రభుత్వ ఆస్తుల అమ్మకాన్ని అడ్డుకోవడానికి ఐక్య కార్యాచరణే ప్రధానమని అన్నారు. ఐక్య పోరాటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్ రామారావు, వైటి దాస్, జె.రామక్రిష్ణ, స్థానిక కార్పొరేటర్ బి.గంగారావు, వి.శ్రీనివాసరావు, వై.మస్తాన్‌ప్ప, బాలభాస్కరరావు, గుమ్మడి నరేంద్ర, కె.రాజబాబు, మూర్తీ, విజ్ఞానంద్, రాంప్రసాద్ ట్రాఫిక్ విభాగం ప్రతినిధులు జె రామన్న, పి హరినాథ్, జి రామారావు, పివి రమణ, జి గోవిందరావు, ఎస్ బాబురావు, ఎం త్రిమూర్తులు పాల్గొన్నారు.

బాబు కోరిక నెరవేరదు

అమరావతి పాదయాత్రపై మంత్రి అంబటి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రైతుల పాదయాత్రతో చంద్రబాబు కోరిక నెరవేరబోదని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆయన బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాజధాని రైతులు యాత్ర పేరుతో తొడలు కొడుతున్నారని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నార న్నారు. రాజధానిని నిర్మించడం దేశంలో సాధ్యం కాదని, 14 ఏళ్లు సీఎంగా ఉండి, ఉత్తరాంధ్రకు ఆయన చేసినదేమీ లేదన్నారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాకే, ఒడిశా సీఎంతో మాట్లాడి వంసధార విషయంలో చర్చించారని, చంద్రబాబు పట్టించుకోలేదని తెలిపారు. ఈ పాద్రయాత్ర విషయంలో చైతన్యవంతులవుతున్న ఉత్తరాంధ్ర ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని అంబటి అన్నారు. మీడియా సృష్టించిన వ్యక్తి అని చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. మండే సూర్యుడి చెంతకు చేరలే రంటూ ఆయనను ఎద్దేవా చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని, టీడీపీకి కన్ను కొడుతున్నారన్నారు. పవన్‌కల్యాణ్‌ను చూస్తే జాలేస్తుందని, ఎవరో అధికారంలోకి రాలేదని పార్టీ పెట్టలేదంటూ అంబటి వ్యాఖ్యానించారు. 175 సీట్లలో పోటీచేసే సత్తా చంద్రబాబుకు ఉందా? అని ప్రశ్నించారు. పవన్‌కు సిద్ధాంతం లేదని, నాడు రాజధానిపై ఏం మాట్లాడారో మరిచినట్లు ఉన్నారని, జనసేన పార్టీకి దీనిపైనా స్పష్టత లేదని అంబటి అన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

వైసీపీ నేతలకు నిమ్మల రామానాయుడు సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రైతులపై అక్కసుతోనే జగన్ మూడు రాజధానుల నాటకమాడుతూ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, ఉత్తరాంధ్ర దోపిడీయే లక్ష్యంగా తనకుట్ర రాజకీయాలు సాగిస్తున్నాడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మండిడ్డారు. బుధవారం ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతలకు ధైర్యముంటే ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎవరు ఏం చేస్తారో చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని పరిణామాలు జగన్ జుగుప్సాకర పాలనకు దర్పణం పడుతున్నాయని ధ్వజమెత్తారు. జగన్ 2014లోనే అమరావతిని స్వాగతించకుండా, అప్పుడే మూడు రాజధానులని చెబితే ఎక్కడుండేవాడు? చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధాని చేస్తే, జగన్ క్రైమ్ కేపిటల్‌గా మార్చాడని విమర్శించారు. మాటతప్పి మడమ తిప్పడం, మోసం, దగా చేయడం జగన్ పేటెంట్ రైట్స్ అన్నారు. రీఆర్గనైజేషన్ యాక్ట్‌తో ఏర్పడిన రాజధానిని మార్చే అధికారం శాసనసభకు లేదని హైకోర్ట్ చెప్పినా జగన్ చెవికి ఎక్కదా? అని ప్రశ్నించారు. రాజు మారినప్పుడల్లా రాజధాని మార్చడం కుదరదని న్యాయస్థానం చెప్పినా వినరా? అన్నారు. 2019కి ముందు అమరావతి అంగుళం కూడా కదలదని ప్రజల్ని నమ్మించిన జగన్, అధికారం దక్కగానే వారిని దారుణంగా వంచించాడని ఆరోపించారు. పదవీ వ్యామోహంతో ఆయన అడుగులకు మడుగులొత్తుతున్న మంత్రులు చివరికి రాజ్యాంగంపై చేసిన ప్రమాణాన్ని కూడా విస్మరించి, పిచ్చిచేష్టలతో అమరావతి రైతుల్ని అవమానించడం సిగ్గుచేటన్నారు. కారుమూరి నాగేశ్వరరావుకు మంత్రి పదవిచ్చింది నల్లబెలూన్లు ఎగరేసి, ఫ్లెక్సీలు కట్టడానికా? కొట్టు సత్యనారాయణకు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది అమరావతి రైతుల్ని ఆడిపోసుకోవడానికా?అని ప్రశ్నించారు. రైతులకు రూ.700కోట్ల ధాన్యం కొనుగోళ్ల తాలూకా బకాయిలు చెల్లించలేని మంత్రి కారుమూరి, అమరావతి రైతుల్ని అవమానిస్తాడా? అని నిలదీశారు. వరిపండించే రైతు అయిన తనకే జగన్ ప్రభుత్వం 6, 7నెలలు గడుస్తున్నా చెల్లించాల్సిన రూ.4.11లక్షలు చెల్లించలేదనీ, మే నెల 21న తాను ధాన్యం అమ్మితే, ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులివ్వలేదన్నానరు. పశ్చిమగోదావరి జిల్లాలోని రైతులు 10వేలఎకరాల్లో పంటల సాగు వదిలేసి, క్రాప్ హాలిడే ఎందుకు ప్రకటించారో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు తెలియదా? అని ప్రశ్నించారు. మూడు రాజధానులు చేసే అధికారం, అవకాశం రెండూ తనకులేవని తెలిసి, కావాలనే ప్రాంతాల మధ్య విబేధాలు రెచ్చగొట్టడానికే జగన్ విద్వేషాలకు ఆజ్యం పోస్తున్నాడని ఆయన విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేని, రైల్వేజోన్ సాధించలేని జగన్ అసమర్థతను బొత్స, ధర్మాన, తమ్మినేని, ఇతర నేతలు ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

మద్దతివ్వకుంటే చరిత్రహీనులే!

'విశాఖ గర్జన' గోడపత్రిక ఆవిష్కరణలో మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన వికేంద్రీకరణకు ఉత్తరాంధ్ర నాయకులు జెండా, అజెండాలను పక్కనపెట్టి మద్దతివ్వాలని, అందుకు భిన్నంగా వ్యవహరించేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో మూడు రాజధానులకు మద్దతుగా ఈనెల 15న చేపట్టిన విశాఖ గర్జన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను బుధవారం ఆయన ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని 2019 డిసెంబర్ లోనే జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, ఈ విధానాన్ని ముందుకు తీసుకువెళ్లనీయకుండా ప్రతిపక్ష పార్టీలు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ రాజధానిగా వద్దంటూ అమరావతి రైతులు దండయాత్రగా రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు అన్ని ప్రాంతాలకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ, విశాఖ గర్జన ఏ వ్యక్తికో, ఏ కులానికో సంబంధించినది కాదని, ఇది ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవ పోరాటమని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖను పరిపాలన రాజధాని చేయడానికి సీఎం జగన్ ప్రయత్నం చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని టీడీపీ నేతలు చంద్రబాబును నిలదీయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ మాట్లాడుతూ, విశాఖ గర్జనకు ఉత్తరాంధ్ర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. జేఏసీ వైస్ చైర్మన్ దేవుడు మాస్టార్ మాట్లా డుతూ, జెండాలు, అజెండాలు పక్కనబెట్టి వెనుకబాటు తనం నుంచి ఉత్తరాంధ్ర బయటపడే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సమన్వయకర్తలు కేకే రాజు, ఆడారి ఆనంద్, తైనాల విజయ్ కుమార్, రొంగలి జగన్నాథం, కొయ్య ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్ట్ డిస్మిస్ చేసింది. గతంలో అనంతబాబు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేయగా, ధర్మాసనం దానిని కొట్టివేసింది. పోలీసులు 90 రోజుల్లో చార్జ్‌షీట్ వేయనందున బెయిల్ ఇవ్వాలని హైకోర్టును అనంతబాబు కోరారు. బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. బాధితుల తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఈ ఏడాది మే 23 నుంచి అనంతబాబు రాజమహేంద్రవరం జైలులో ఉన్న విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో మూడు విడతలుగా బెయిల్ పిటిషన్ల తిరస్కరణకు గురయ్యాయి.

'అమరావతి' పాదయాత్రకు ఏఐకేఎస్ సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి నుంచి అరసవిల్లికి రాజధాని రైతులు తలపెట్టిన పాదయాత్రకు అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) సంఘీభావం ప్రకటించింది. గురువారం ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకయ్య, అతుల్‌కుమార్ అంజన్‌తో పాటు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేవీవీ ప్రసాద్ పాల్గొంటారు. అమరావతి జేఏసీ అధ్వర్యంలో రైతులు చేపట్టిన రెండో దశ పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా, ఉండ్రాజవరం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో నాయకులు పాల్గొంటారు.

మావోయిస్టులపై దుష్ప్రచారం వీడండి

- మంత్రి 'సీదిరి' దివాలాకోరు రాజకీయం
- విప్లవ యువజన సంఘం ఆంధ్రా-ఒడిశా బోర్డర్ కమిటీ కార్యదర్శి అశోక్

విశాలాంధ్ర-మందస: రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, అతడి అనుయాయుల భూ దందాను బయటపెట్టి, అక్రమంగా ఆక్రమించిన రామక్రిష్ణాపురం, సూదికొండ, నెమలికొండ భూముల నుంచి వారు తక్షణమే వైదొలగాలని, ఆ భూములు ఈ ప్రాంత పేద ప్రజలకే చెందాలని ప్రజల తరుపున మాట్లాడిన మావోయిస్టు పార్టీపైన, ఆ పార్టీ ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీపైన మంత్రి సోషల్ మీడియాలో విరుచుకుపడడం అతడి దివాలాకోరు రాజకీయాలకు పరాకాష్ట అని విప్లవ యువజన సంఘం ఆంధ్రా- ఒడిశా బోర్డర్ కమిటీ కార్యదర్శి అశోక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాము పంపిన లేఖను ప్రచారం చేసినవారిపై కూడా చర్యలు ఉంటాయని భయపెట్టడం హేయమైన చర్య అని అన్నారు. మంత్రి అప్పలరాజుకు వత్తాసు పలుకుతూ చిక్కోలు ఎడిటర్ జగదీష్, 'జనం సాయంత్రం' పత్రిక రమణ సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తూ తెలుగుదేశం హయాంలో జరిగిన వాటికి మావోయిస్టు పార్టీ నోరు ఎందుకు విప్పలేదని, అప్పుడు మాట్లాడని మావోయిస్టు పార్టీకి ఇప్పుడు మాట్లాడే అర్హత లేదని కితాబు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. దోపిడీ దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఏ రాజకీయ పార్టీ అయినా మావోయిస్టు పార్టీ ముందు ఒక్కటే అని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మావోయిస్టులు ప్రజల కోసమే జీవిస్తారు... ప్రజల కోసమే మరణిస్తారు... ఇదే నడుస్తున్న చరిత్ర అని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీ ప్రజా సంఘాల నాయకులుగా చెలామణి అవుతున్న దుష్ట చతుష్టయం (పోతనపల్లి అరుణ, జోగి కోదండం, పత్తిరి దానేసు, కొర్రాయి నీలకంఠం) లోపాయికారంగా ఇస్తున్న సూచనలు, సలహాలు, సహకారంతో దురహంకారపూరితంగా నోటికి వచ్చినట్లు మాట్లాడితే చరమగీతం పాడేరోజు దగ్గరలోనే ఉందని పేర్కొన్నారు.

విశాఖలో 'ఇమెరిస్' ప్రాంతీయ పరిశోధన, అభివృద్ధి కేంద్రం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ప్రాంతీయ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేసే ప్రక్రియలో ఇమెరిస్ ఉందని ఫ్రాన్స్ రాయబారి ఇమ్మాన్యుయేల్ లెనైన్ అన్నారు. పరిశ్రమలకు ఖనిజ ఆధారిత స్పెషాలిటీ సొల్యూషన్లలో అగ్రగామిగా ఉన్న ఇమెరిస్ విశాఖలో ఏర్పాటు చేసిన తయారీ కర్మాగారాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం లెనైన్ మాట్లాడుతూ, ఈ కేంద్రం భారతదేశంలో నిర్దిష్ట కస్టమర్ మాండేట్ల కోసం స్థానిక ఉత్పత్తుల అభివృద్ధి, సృజనాత్మకతలకు మద్దతు ఇస్తుందన్నారు. అంతర్జాతీయ సాంకేతిక, ఉత్పాదక ప్రమాణాలకు అనుగుణంగా కంపెనీ ఉత్పత్తుల నాణ్యతను పెంచడానికి కూడా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని ఇమెరిస్ ఆశిస్తోందన్నారు.

95 శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులు స్థానికులేనని, వీరిలో 100 మంది ఫుల్ టైమ్, మరో 100 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారన్నారు. స్థానిక మార్కెట్ల కోసం అవసరమైన ఉత్పత్తులను రూపొందించడంపై దృష్టి సారించడంలో భాగంగా, ఇమెరిస్ సంస్థ స్థానికంగా తయారు చేసిన ఉత్పత్తి కాల్షియం అల్యూమినేట్ బైండర్ల ద్వారా మార్కెట్ కోసం తన ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయమైన ఉత్పత్తులను విస్తరించిందన్నారు. విశాఖపట్నంలో పెట్టుబడులు, ఉత్పత్తిని ఇమెరిస్ పెంచుతుందన్నారు. రూ.350 కోట్లతో ఏర్పాటు చేసిన కర్మాగారంలో 2030 నాటికి ఉత్పత్తిని 50 వేల టన్నులకు పెంచే లక్ష్యంగా పని చేస్తుందన్నారు.

బలవంతపు భూసేకరణ దుర్మార్గం

సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

విశాలాంధ్ర-బనగానపల్లి రూరల్: పోలీసు పహారాలో ప్రజాభిప్రాయ సేకరణ నిలుపుదలచేయాలనీ, 1000 మంది పోలీసులతో చేస్తే అది ప్రజాభిప్రాయ సేకరణ అవదనీ, బలవంతపు భూసేకరణ అంటారని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు విమర్శించారు. బనగానపల్లి మండలం ఎనకండ్ల గ్రామంలో బుధవారం చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణపై సీపీఐ బృందం అధికారులకు వినతిపత్రం అందచేసింది. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ, ఎనకండ్లలో జయజ్యోతి సిమెంట్ కంపెనీ యాజమాన్యం ఇప్పటివరకు దాదాపు 2500 ఎకరాల భూమిని సేకరించిందన్నారు. బనగానపల్లె నవాబు గుర్రపు శాల కోసం విడిచిన కొండను ఇప్పటికే ఫ్యాక్టరీ యాజమాన్యం కంచెవేసి స్వాధీనం చేసుకుందనీ, అది చాలదన్నట్టు ఎర్రగుడి, ఎనకండ్ల, హుస్సేనాపురం గ్రామాల సరిహద్దులో ఉన్న రైతుల పొలాలను, తుమ్మలచెరువును బలవంతంగా లాక్కునేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులపై కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్థానిక శాసనసభ్యుడు రామిరెడ్డి వారికి న్యాయం చేయకపోగా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి యాజమాన్యానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఎకరాకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలనీ, కాలుష్యాన్ని నివారించాలని, మూడు గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ,మండల కార్యదర్శి ఏ సుబ్బారెడ్డి, మండల సహాయ కార్యదర్శి కే శివయ్య, ఏఐటీయుసి కార్యదర్శి బాలకృష్ణ ,ఏపీ జివిఎస్ జిల్లా అధ్యక్షుడు కళింగర రాముడు, సంజీవులు,రైతు సంఘం నాయకులు ఇమాములు, శివ నాగయ్య,హుసేని, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎల్ఐఎస్సీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గుర్తింపు పొందిన మూడు సంస్థలు నిర్వహించనున్న ఐదు నెలల సర్టిఫికెట్ కోర్సు ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(సీఎల్ఐఎస్సీ)లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంధాలయాలశాఖ సంచాలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ విజయవాడ; రాయలసీమ ఇనిస్టిట్యూట్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, గాంధీనగర్, కడప; వావిలాల సంస్థ లైబ్రరీ సైన్స్, అరండల్ పేట, గుంటూరులోని సంస్థల్లో ఒక్కొక్క సంస్థలో 40 తెలుగు, 40 ఆంగ్ల మాధ్యమ సీట్లు కలిపి 120 చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు.

సీఎంతో జెనీఫర్ లార్సన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమెరికా కాన్సులేట్ జనరల్ జెనీఫర్ లార్సన్ బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఆమెకు జగన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కోవిడ్ కట్టడికి బాగా పనిచేశారని ముఖ్యమంత్రిని జెనీఫర్ అభినందించారు. అలాగే, జీడీపీ వృద్ధిరేటులో ఏపీ నంబర్‌వన్‌గా ఉండటాన్ని కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జగన్ తెలిపారు. తమ తరఫున ఎలాంటి సహకారం అందించడానికైనా సిద్ధమేనని ఆమెతో అన్నారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' Procurement Notification

ROC. No. E-21171/2022/E3, **Dt : 10-10-2022**

Tenders invited through ap e procurement platform for 08 woks with an estimated contract value of **Rs. 4,08,76,541/-** from the eligible contractors in the following manner.

Two Works for an amount of Rs. 5,18,328/-
Last date and time for downlonding did documents :
20.10.2022 upto 10-00 AM
Last date and time for submission of bids :
20.10.2022 upto 10-30 AM

Six Works for an amount of Rs. 04,03,58,213/-
Last date and time for downlonding did documents :
28.10.2022 upto 10-00 AM
Last date and time for submission of bids :
28.10.2022 upto 10-30 AM

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : kkd_mplcorp@yahoo.com Call Centre Phone : 0884-2357722. **Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in**

Yours Faithfully,
Sd. K. Ramesh,
Commissioner
Municipal Corporation, Kakinda

సంపాదకీయం

శశీ థరూర్ ఒంటరి పోరు

రెండు దశాబ్దాల తరవాత కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో ఆ పార్టీలో ప్రజాస్వామ్యం మళ్లీ అంకురిస్తుందన్న ఆశలు మొలకెత్తాయి. అయితే కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికల ప్రక్రియ మొత్తం పరిమిత ప్రజాస్వామ్య మూసలోకి దించేశారు. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించగానే శశీ థరూర్ పోటీకి సిద్ధపడిపోయారు. ఆయన సోనియాను దర్శించి తన ఆకాంక్ష వ్యక్తం చేశారు. సోనియా తన మనసులో మాట బయట పెట్టలేదు కానీ ఆయనను ప్రోత్సహించలేదు. అభ్యంతరమూ వ్యక్తం చేయలేదు. తాను జోక్యం చేసుకోను అని చెప్పినా మొదట అభ్యర్థి అనుకున్న రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ సోనియా గాంధీ కుటుంబం మద్దతు ఆయనకే ఉందన్నది బహిరంగ రహస్యమే. ఆయన జోడు పదవులు కావాలని పట్టుబట్టకుండా ఉంటే ఆయనే రంగంలో ఉండేవారేమో! దిగ్విజయ సింగ్ పోటీ చేయడానికి సిద్ధపడ్డా సోనియా మద్దతు ఆయనకు ఉన్నట్టు కనిపించలేదు. ఆమె మనసులో మల్లికార్జున్ ఖడ్గే ఉన్నారని దిగ్విజయ్ చివరి నిమిషంలో తప్ప కనిపెట్టలేదు. చివరకు ఖడ్గే రంగ ప్రవేశం చేశారు. ఇంతకు ముందు కాంగ్రెస్‌లో సంస్థాగత సంస్కరణలు కావాలని సోనియాకు లేఖ రాసిన బృందంలో కొందరు బీజేపీలోకి దూకేసిన తరవాత మిగిలిన వారూ శశీ థరూర్ అభ్యర్థిత్వాన్ని మెచ్చలేదు. ఆ 23 మంది బృందంలో చాలామంది ఖడ్గే నామినేషన్ దాఖలు చేసినప్పుడు ఆయన వెంటే ఉన్నారు. నిజానికి శశీ థరూర్ 23 మందితో కూడిన బృందం నిలబెట్టిన అభ్యర్థి ఏమీ కాదు. ఆ బృందం అసలు అలాంటి ఆలోచనే చేయలేదు. శశీ థరూర్ కూడా తాను ఆ అసమ్మతి బృందం ప్రతినిధిగా పోటీ చేస్తున్నానని చెప్పలేదు. మల్లికార్జున్ ఖడ్గే కచ్చితంగా సోనియా గాంధీ మద్దతు ఉన్న అభ్యర్థి అని బాహాటంగానే తెలిసిపోయింది. కాంగ్రెస్ అధ్యక్షుడిని ఎన్నుకునేది కేవలం 9000 మంది మాత్రమే. ఇద్దరు అభ్యర్థులూ ప్రచారం చేసుకుంటూనే ఉన్నారు. ఎవరు అధ్యక్షులుగా ఎన్నికైనా సోనియా గాంధీ కుటుంబం, మరీ ముఖ్యంగా రాహుల్ గాంధీకే పార్టీ వ్యవహారాల్లో అగ్రాసనం ఉంటుందని ఇప్పటికే దాపరికం లేకుండానే చెప్తున్నారు. పార్టీ అధ్యక్ష స్థానంలో ఉన్నవారు నిరంకుశంగా వ్యవహరించకూడదన్న నియమంతో ఎవరికీ పేచీ ఉండక్కర్లేదు. కానీ ముఖ్యమైన విషయాల్లో సోనియా కుటుంబంలోని వారి ప్రమేయం ఉంటుందన్నది వాస్తవం. పార్టీ అధ్యక్షులు వేరు నాయకులు వేరు అన్న భాష్యాలూ వినిపిస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ విషయంలో ఆ మాట నిజమే. బీజేపీలోనూ వాజపేయి, అద్వాణీకే అగ్రసానాధిపత్యం ఉండేది. పార్టీ అధ్యక్షులుగా ఎవరున్నా వారిద్దరి మాటను జవదాటి వ్యవహరించిన బీజేపీ అధ్యక్షులు ఎవరూ లేరు. కాంగ్రెస్ లోనూ మొదటి నుంచీ అదే పరిస్థితి. నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్ లాంటి దిగ్దంతలు ఎంతమంది ఉన్నా కాంగ్రెస్‌లో ఆ నాడూ తిరుగులేని నాయకుడు నిస్సందేహంగా మహాత్మా గాంధీనే. గాంధీ ఒకే ఒక్క సారి 1924లో కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరించారు. అయితే అప్పుడు సంస్థాగత ఎన్నికలు క్రమం తప్పకుండా జరిగేవి.

గాంధీ, పటేల్, మౌలానా ఆజాద్ మరణం తరవాత 1950 నుంచి పండిత్ నెహ్రూ చివరి దాకా తిరుగులేని నాయకుడిగా కొనసాగారు. అయితే ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ఇతరులు కాంగ్రెస్ అధ్యక్ష స్థానంలో ఉన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా నెహ్రూనే అంతిమ నాయకుడు.

ఇందిరాగాంధీ హయాంలోనూ కొంతకాలం ఆమె ప్రధానిగా ఉంటే ఇతరులు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఆ సంప్రదాయానికి ఇందిరాగాంధీయే స్వయంగా గండి కొట్టారు. రెండు పదవులూ ఆమె దగ్గరే ఉంచుకున్నారు. ఆమె తరవాత రాజీవ్ గాంధీ, పీవీ నరసిం హారావు ఆ సంప్రదాయాన్నే కొనసాగించారు. సోనియా 1998లో కాంగ్రెస్ అధ్యక్షురాలు అయిన తరవాత మధ్యలో రాహుల్ అధ్యక్షులుగా వ్యవహరించిన కొద్ది కాలం మాత్రం మినహా కాంగ్రెస్ పై ఆమె ఆధిపత్యానికి తిరుగు లేకుండా పోయింది. రాహుల్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తరవాత ఆయనకు అవకాశం వచ్చినా మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా మంత్రిపదవి స్వీకరించడానికి నిరాకరించారు. కాంగ్రెస్ వ్యవహారాల్లో మాత్రం ఆయన ప్రమేయం అంతకంతకూ పెరగడం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మన్మోహన్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడూ అసలు అధికారం సోనియా గుప్పెట్లోనే ఉందని, ఆయన కేవలం సోనియా చేతిలో కీలుబొమ్మ అన్న విమర్శలు హోరెత్తాయి. కాంగ్రెస్ పార్టీ మీద సోనియా కుటుంబం పట్టుకు ఎదురులేకుండా పోయింది. ఉదాహరణ ప్రాయంగా కూడా అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహించే ఆలోచనకైనా తావు లేకుండా పోయింది. మన్మోహన్ ఏలుబడిలో మంత్రిపదవి ఒద్దన్న రాహుల్ ఇప్పుడు కాంగ్రెస్ అధ్యక్షస్థానం వద్దంటున్నారు. కానీ పెత్తనం ఆయనదేనన్నది నిర్వివాదాంశం. నిజానికి 23 మంది బృందంలోని వారి అభ్యంతరం లేదా ఫిర్యాదు సోనియాగాంధీ మీద కాదు. రాహుల్‌గాంధీ మీద నమ్మకం లేకపోవడమేనని అనేక పరిణామాలు రుజువు చేశాయి. అయితే నిర్ణయాధికారం రాహుల్ చేతిలోనూ ఉండడాన్ని అంతో ఇంతో అసమ్మతి వ్యక్తం చేసే వారూ ఎన్నడూ వ్యతిరేకించలేదు. పోటీ చేయాలని నిర్ణయించుకున్న తరవాత వెనుదిరిగిచూడడానికీ, పోటీ నుంచి విరమించు కోవడానికీ థరూర్ సిద్ధపడలేదు.

విరమించుకోమని నన్నెవరూ అడగలేదంటున్నారు. ఎన్నిక నిర్వహిస్తున్నట్టు కనిపించడానికైనా సోనియా కుటుంబానికి థరూర్ పోటీ చేయడం అవసరం. జయాపజయాలు చేతిలో ఉన్నంత కాలం థరూర్ పోటీవల్ల పోయేది ఏమీ లేదు. ఆయన విరమించుకుంటే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేసిన వారి ఆంతర్యం ఏకాభిప్రాయంతో ఖడ్గే ఎన్నికయ్యేట్టుచూడడమే. ఈ ఏకాభిప్రాయ సాధన కూడా సంస్థాగతంగా ప్రజాస్వామ్య విధానాన్ని అనుసరించడానికి ఉపకరించదు. ఎన్నిక నిర్వహించడానికి మధ్యలో అయిదు రోజులే మిగిలాయి. ఖడ్గే సోనియా గాంధీ కుటుంబం మద్దతు ఉన్న వారే కనక ఆయన విజయం ఖాయం. శశీ థరూర్ ఎంత తక్కువ వోట్లు సంపాదించినా ప్రజాస్వామ్య ప్రక్రియ తంతుగానైనా కొనసాగడానికి తోడ్పడుతుంది. ఆ మేరకు చిరు మార్పు వచ్చినట్టే. ఇక మిగిలిందల్లా శశీ థరూర్ ఒంటరి పోరాటమే.

మోదీకి అద్దం చూపుతున్న సత్యపాల్ మాలిక్

మొన్నటిదాకా మేఘాలయ గవర్నరుగా ఉన్న బీజేపీ నాయకుడు సత్యపాల్ మాలిక్ విభిన్నమైన వ్యక్తి. అయితే ఆయన ఆర్.ఎస్.ఎస్. కుదురుకు చెందినవారు కాదు. అనేక పార్టీలు మారిన తరవాతే 2012లో మాత్రమే బీజేపీలో చేరారు. అయినా ఆయనను బీజేపీ ఉపాధ్యక్షుడిని చేయడమే కాకుండా నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌ను చేశారు. 2017 సెప్టెంబర్ 30 న ఆయనను బీహార్ గవర్నరుగా నియమించింది మోదీ ప్రభుత్వమే. కానీ ఆయన 2018 ఆగస్టు 21దాకా మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. 2018 ఆగస్టు నుంచి 2019 అక్టోబర్ దాకా జమ్మూ కశ్మీర్ గవర్నరుగా పనిచేశారు. 1980 నుంచి జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాద ఆగడాలు పెరిగిన తరవాత ఆ రాష్ట్రానికి గవర్నర్ అయిన మొదటి రాజకీయ నాయకుడు సత్యపాల్ మాలిక్ మాత్రమే. ఆ తరవాత 2019 నవంబర్ 3 న గోవా గవర్నరుగా నియమించారు. ఆ స్థానంలో ఆయన 2020 ఆగస్టు 18 దాకా మాత్రమే ఉన్నారు. వెంటనే ఆయనను మేఘాలయ గవర్నరుగా నియమించారు. 2022అక్టోబర్3న ఆయన గవర్నర్‌పదవిని వదిలేశారు. 2021లో కొంతకాలం ఆయన ఒరిస్సాగవర్నరుగా అదనపు బాధ్యతలూ నిర్వర్తించారు.

నాలుగురాష్ట్రాలకు గవర్నరుగా నియమించిన బీజేపీప్రభుత్వం సత్యపాల్

ఒకే ఒక్కడు

మాలిక్‌ను దండిగానే ఆదరించిందనుకోవాలి. కానీ ఆయన మోదీ ప్రభుత్వం మీద విమర్శలు గుప్పిస్తున్నారు. మోదీ పెద్ద అహంకారి అంటారు. 2021 నవంబర్ 8 న ఆయనను అంతర్జాతీయ జాట్ల సమావేశానికి ఆహ్వానించారు. ఆయన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ 2020-21లో ఢిల్లీ పొలిమేరల్లో జరిగిన రైతుల ఆందోళనను నిర్మొహమాటంగానే సమర్థించారు. అంతటితో ఆగకుండా సిక్కులను లొంగ దీయడం కుదరదనీ గురుగోవింద్ సింగ్ నలుగురు కుమారులను హతమార్చినా ఆయన లొంగ లేదనీ అలాగే జాట్లను లొంగదీయడమూ కుదరని తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. అమృత్సర్ స్వర్ణ దేవాలయంలో 1984 లో సైనిక చర్య తరవాత అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీనీ, సేనాధిపతి ఏ.ఎస్. వైద్యను హతమార్చిన అంశాన్ని మాలిక్ ప్రస్తావించడం యాదృచ్ఛికం ఏమీ కాదు. ఈ వ్యాఖ్యలన్నీ మోదీని దృష్టిలో పెట్టుకుని చేసినవేనని ప్రత్యేకంగా విడమర్చి చెప్పనవసరం లేదు. సత్యపాల్ మాలిక్ అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడే కాదు మాజీ ప్రధాన మంత్రులు చరణ్ సింగ్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ కు సన్నిహితులు. నిర్మోహమాటంగా మాట్లాడే స్వభావం ఉన్నప్పటికీ ఆయన జమ్మూ-కశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సమయంలోనే 370 వ అధికరణాన్ని రద్దు చేశారు. విచ్చలవిడిగా మాట్లాడే తత్వం ఉన్న మాలిక్ ఎందుకో జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా చేయడాన్ని తప్పుబట్టలేదు. జమ్మూ-కశ్మీర్ గవర్నర్ అయిన తరవాతే ఆ రాష్ట్రంలో గవర్నర్లుగా ఉన్న గవర్నర్లందరూ మద్యం సేవిస్తూ, గోల్ఫ్ ఆడుతూ కాలక్షేపం చేసినవారే అనడంలోని ఉచితానుచితాలను పక్కన పెట్టినా అది కుండ పగులగొట్టినట్టు మాట్లాడే మాలిక్ తత్వానికి ప్రతీక.

సైనికులను నియమించడానికి మోదీ సర్కారు అగ్నిపథ్ పథకం ప్రవేశపెట్టి వారు నాలుగేళ్లు మాత్రమే ఉద్యోగంలో ఉండే అగ్ని వీరులన్నప్పుడు మాలిక్ ఆ నిర్ణయాన్ని నిర్ద్వంద్వంగా దుయ్యబట్టారు. నాలుగేళ్లు సైన్యంలో ఉద్యోగం చేసి పింఛన్ లాంటి సదుపాయాలు ఏమీ లేని వారిని పెళ్లి ఎవరు చేసుకుంటారు అని కూడా అన్నారు.

సత్యపాల్ మాలిక్ తత్వం, స్వభావం మాట ఎలా ఉన్నా మోదీ అంటే ఆ పార్టీ నాయకుల్లోనే వ్యతిరేకులు ఉన్నారని అర్థం అవుతోంది. నియంతల ఎదుట దాపరికం లేకుండా మాట్లాడడం సాధ్యం కాదు. సాహసికులు మాత్రమే మనసులో మాట అరమరికలు లేకుండా చెప్పగలరు. సత్యపాల్ మాలిక్ అలాంటి అరుదైన వ్యక్తి. అందవలసిన పదవులు అందలేదన్న చింత ఆయనకేమీ లేదు. భారతీయ క్రాంతి దళ్, జనతా దళ్, సమాజ్ వాదీ పార్టీలను చుట్టబెట్టి వచ్చినా బీజేపీ ఆయనకు ఏ లోటూ చేయలేదు. ఆయన ముక్కు సూటితనంవల్ల ఇబ్బంది ఏమైనా ఉంటే అది బీజేపీకే. మోదీకి అద్దం చూపించిన సాహసికుడు సత్యపాల్ మాలిక్.

-అనన్య వర్మ

భారతదేశ గుండె చప్పుడు 'యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్'

రెహమాన్

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువ కమ్యూనిస్టులు ఫ్లాగ్ మార్చ్ ఈ నెల 5 వ తేదీన కేరళ రాష్ట్రంలోని కొల్లంలో ప్రారంభమైంది. కేరళ, తమిళనాడు సరిహద్దులను దాటి 11 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన జాతా 13 వ తేదీ సాయంత్రం విజయవాడకు చేరుకోనుంది. దేశంలో నేడు నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలలో పూర్తిగా విఫలమయ్యింది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి దేశ ప్రజల మధ్య వైషమ్యాలు రగిల్చిన మృత్యు బేహారీ మోదీ.

విద్యా రంగంలో మతపరమైన అంశాలను, మూఢ నమ్మకాలను ప్రవేశపెట్టి భవిష్యత్తు భారతాన్ని అంధకారంలోకి నెట్టారు. విద్యా ప్రైవేటీకరణకు పాల్పడుతూ అణగారిన వర్గాలకు విద్యను దూరం చేస్తున్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను మోదీ మోసం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్‌లకు అప్పజెప్పారు. నోట్ల రద్దు, బ్యాంకుల విలీనంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నిత్యావసర ధరలు సామాన్యుడికి గుదిబండగా మారాయి. చివరికి సైన్యాన్ని కూడా కాంట్రాక్టు పద్ధతిలో నియమించి దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టారు. వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా వుండే గ్రామీణ భారతాన్ని విచ్ఛిన్నం చేయడానికి వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వం, రైతులు రాజధాని దిల్లీని సంవత్సరం పాటు దిగ్బంధించడంతో చివరికి వెనక్కి తగ్గింది. వర్తమానంలో మోదీ, షా ద్వయానికి ఎదురులేదని భావిస్తున్న తరుణంలో రైతుల పోరాట పటిమ, వారి అకుంఠిత దీక్ష దేశ ప్రజలకు పోరాట ఫలాలు రుచి చూపించారు. ఎంతటి నియంతలనైనా పోరాటంతో తలవంచేలా చేయొచ్చని రైతు పోరాటం నిరూపించింది.

అనేక మతాలు, కులాలు భిన్న సంస్కృతులు వున్నా తరాలుగా స్నేహపూర్వకంగా మెలిగిన చరిత్ర ఈ దేశానిది. పుణ్యభూమిగా కీర్తించే భారతదేశంలో కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టి ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్, మతోన్మాద సంస్థలు విభజిత రాజకీయాలకు పాల్పడుతున్నాయి. దళితులు, మహిళలు, మైనారిటీలు, ఆదివాసీ ప్రజలు దినదిన గండంగా భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. తమ అభిప్రాయాలతో ఏకీభవించని వాళ్ళను, ప్రజాస్వామిక వాదులను అర్బన్ నక్సలైట్‌ల పేరిట జైళ్ళలో పెడుతున్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కైన భావప్రకటనా స్వేచ్ఛకు బంధనాలు వేశారు. చివరికి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి ఏం తినాలో, ఎలాంటి బట్టలు వేసుకోవాలో కూడా నిర్ణయిస్తున్నారు.

> దాదాపు పదహారు వందల కిలోమీటర్లు సాగిన యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్ ప్రయాణం భారత స్వాతంత్ర్య సమరంలో ఉరికంబమెక్కిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాల తోవలో సాగింది. కేరళ పున్నప్రా వాయిలార్ అమరుల స్ఫూర్తితో తరలింది. సెన్నియమ్ బాలయమ్ త్యాగాలను ఎత్తిపట్టింది. మా ఈ ప్రయాణం ఇక్కడితో ఆగదు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో ఎర్రజెండాలను ఎగురవేసి, భారతదేశంలో సోషలిస్టు విప్లవం సాధించే వరకు, సామ్యవాద స్వప్నం సిద్ధించే వరకు మా ప్రయాణం ఆగదు. పావన నవజీవన బృందావన నిర్మాణంకై సాగుతూనే వుంటుంది.

ఒకవైపు పేదవాళ్ళు మరింత పేదరికంలోకి నెట్టబడుతుంటే, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారు. ఒక్కపూట భోజనానికి తంటాలు పడుతూ ఆకలి సూచిలో మరింత దిగజారిన భారతదేశంలో, ఆదాని లాంటి వాళ్ళు ప్రపంచ ధనవంతుల జాబితాలో రెండవ స్థానానికి ఎగబాకడం ప్రభుత్వాల ప్రాధామ్యాలను తెలియజేస్తోంది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ మోడల్ అభివృద్ధి అంటూ ఆయా రాష్ట్రాల్లో ఆకలి చావులను, గంగానదిలో తేలిన కోవిడ్ శవాల లెక్కలు ఇంకా బహిరంగ పరచడం లేదు. ఇలాంటి తరుణంలో కేరళ నుండి బయలుదేరిన యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్ ఈ దేశ ప్రజల్లో నమ్మకాన్ని పెంచి, భవిష్యత్తు పై ఆశలు కలిగించింది. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువకులు భిన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలకు సంబంధించిన వాళ్లు. కానీ అందరినీ ఒక్కచోటికి వచ్చేలా చేసింది మా ప్రాపంచిక దృక్పథం అయిన కమ్యూనిజం. ఈ దేశంలో నెలకొన్న సంక్షుభిత పరిస్థితులను మార్చాలనే దృఢ సంకల్పం కామ్రేడ్‌లుగా ఫ్లాగ్ మార్చ్‌లో ముందుకు సాగాం.

కేరళ నుండి బయలుదేరిన యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్ అరేబియా సముద్ర తీరం వెంట, పశ్చిమ కనుమల సానువుల గుండా సాగింది. ఈ క్రమంలో కేరళ ప్రజలు మా జాతాను గుండెలకు హత్తుకున్నారు. విద్యార్థులు, యువతీ యువకులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, సాధారణ ప్రజలు సాదర స్వాగతం పలికారు. కేరళ రాష్ట్రం దాటి తమిళనాడు రాష్ట్రంలోకి ప్రవేశించిన ఫ్లాగ్ మార్చ్‌ను తమిళ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఉత్తర తమిళనాడు జిల్లాల నుంచి సాగిన మా ప్రయాణంలో ఆ ప్రాంత భిన్నత్వాన్ని నిశితంగా పరిశీలించాం. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులుగా కలిగిన ఈ ప్రాంత ప్రజలు మళయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషలను మాట్లాడుతారు. వారి నిత్య జీవన విధానం కూడా ఒక గొప్ప సాంస్కృతిక సమ్మేళనం కలిగి ఉంటుంది. అనంతరం తమిళనాడు సరిహద్దు దాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించిన ఫ్లాగ్ మార్చ్ శేషాచలం పర్వత శ్రేణుల వెంట, బంగాళాఖాతం తీరం వెంబడి, సీపీఐ 24 వ జాతీయ మహా సభలు జరిగే కృష్ణా నదీ తీరంలోని విజయవాడ నగరానికి చేరుకుంటుంది. ఎర్రజెండాకు పుట్టిల్లుగా భావించే విజయవాడ ప్రజలు రాజకీయ చైతన్యంతో వుంటారు. సామాజిక, ప్రజాస్వామిక ఉద్యమాలకు నెలవైన విజయవాడ నగరానికి ఆధునిక ఉద్యమాల చరిత్రలో ప్రాధాన్యం కలిగిన నగరం.

దాదాపు పదహారు వందల కిలోమీటర్లు సాగిన యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్ మార్చ్ ప్రయాణం భారత స్వాతంత్ర్య సమరంలో ఉరికంబమెక్కిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాల తోవలో సాగింది. కేరళ పున్నప్రా వాయిలార్ అమరుల స్ఫూర్తితో తరలింది. సెన్నియమ్ బాలయమ్ త్యాగాలను ఎత్తిపట్టింది. మా ఈ ప్రయాణం ఇక్కడితో ఆగదు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో ఎర్రజెండాలను ఎగురవేసి, భారతదేశంలో సోషలిస్టు విప్లవం సాధించే వరకు, సామ్యవాద స్వప్నం సిద్ధించే వరకు మా ప్రయాణం ఆగదు. పావన నవజీవన బృందావన నిర్మాణంకై సాగుతూనే వుంటుంది.

గ్రహణాల పట్ల అపోహలు వద్దు

ఈ-మెయిల్

ప్రజల్లోగ్రహణాల పట్ల చాలా అపోహలున్నాయి. గ్రహణం సమయంలొ గర్భిణులు బజారులో తిరగరాదని, తిరిగితే పుట్టేపిల్లలు మొర్రితో పుడతారని, ఆ సమయంలో ఆహారం తీసుకోరాదని, నీళ్ళుకూడా తాగరాదని, పట్టుస్నానాలూ, విడుపు స్నానాలు అంటూ కొంతమంది గ్రహణాల పట్ల అవగాహన లేనివారు ప్రజలను భయపెడు తుంటారు. ఆ సమయంలో దేవుళ్లగుళ్లను కూడా మూసివేస్తారు. ఆపదమొక్కుల వాడు, పిలిస్తేపలికే తిరపతి వెంకన్నగుడి కూడా మూసివేస్తారు. ఇదంతా నిజమేనా!

ఈ నెల 25 చంద్రగ్రహణం, ఏర్పడుతుంది. గ్రహణం అంటే చంద్రుడు, భూమి తమ చుట్టూ తాము తిరుగుతూ, సూర్యునిచుట్టు తిరిగే క్రమంలో ఒకదాని నీడ ఒకదాని మీద పడి గ్రహణం ఏర్పడుతుంది. సూర్యుడికి చంద్రునికి మధ్యలో భూమి వచ్చినపుడు, సూర్యకాంతి చంద్రుని మీద పడనందున చంద్రగ్రహణం ఏర్పడుతుంది. అలాగే సూర్యునికి భూమికి మధ్యలో చంద్రుడు వచ్చినపుడు, సూర్యకాంతి భూమిమీద పడక సూర్య గ్రహణం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని ఆదునిక విజ్ఞానం ధ్రువపరుస్తుంది. కానీ పుక్కిటి పురాణాలలో మాత్రం రాహువు కేతువు అనే రాక్షసులు సూర్యుణ్ణి, చంద్రుణ్ణి మింగుతారని, అందువలన గ్రహణాలు వస్తాయని పంచాంగకర్తలు చెప్పి, దానికి శాంతిపూజలు కూడా చేస్తారు. అంతేకాదు గ్రహణం సమయంలో ఫ్రిజ్‌లలో ఉన్న పదార్థాలు చెడిపోతాయని, దానికి విరుగుడుగా ఆవు పేడను ఫ్రిజ్‌లకు పూస్తే లోపలి పదార్థాలు చెడిపోకుండా ఉంటాయని కూడా ఈ మధ్య కొంతమంది ప్రచారం చేస్తూ , తమ తెలివి తక్కువతనాన్ని బయటపెట్టుకుంటున్నారు.

ఇది కేవలం మూఢ నమ్మకము మాత్రమే .ఒకపక్క ప్రపంచ మానవుడు ఇతర గ్రహాలలో కాపురం పెట్టేందుకు ఉరకలు వేస్తుంటే, మనం ఇంకా ఫ్రిజ్‌లకు ఆవుపేడ పూస్తున్నామంటే , గ్రహణం సమయంలొ గర్భిణీలు తిరగరాదని , ఏమీ తినటం గాని , తాగటం గాని చెయ్యటం చెయ్యకూడదని , అసమయంలో సైన్స్ పంతుళ్లు సయితం దుప్పటి కప్పుకుని ముడుసుకొని పడుకుంటున్నాడంటే మనం సిగ్గుపడాలి. మనం దుప్పటి కప్పుకొని పడుకోవటం కాదు, పాపం దేవుళ్లను కూడా భయపెడుతూ తలుపులు మూసివెయ్యటం, వాళ్లకి ఎన్నో మహిమలూ ఉన్నాయని చెప్పుకోవటం ఎందుకూ? మహిమలు మా దేవుళ్ళకు లేవని కనీసం చెప్పుకోండి. గ్రహణాల సమయంలో చాలామంది హేతువాదుల కుటుంబాల లోని గర్భిణులు తిరుగుతూ, తింటూ, తాగుతూ, ఏమీకాదని నిరూపించారు. ఆ సమయంలో పుట్టిన పిల్లలు చందమామలాగా ఉన్నందున వారికి చందమామ అనిపేర్లు పెట్టుకున్నారు. కనుక గ్రహణాల పట్ల అపోహలు వీడండి. సైన్స్ తెలుసుకోండి.

నార్నె వెంకటసుబ్బయ్య

బిహార్‌లో బీజేపీ కొత్త వ్యూహం

అరుణ్‌శ్రీవాస్తవ

సంపూర్ణ విప్లవం పేరుతో ఉద్యమం నడిపిన లోక్‌నాయక్ జైప్రకాశ్ నారాయణ్‌పై నరేంద్రమోదీ, అమిత్‌షాలకు ఆకస్మికంగా ప్రేమ పుట్టుకొచ్చింది. 2024 లో లోక్‌సభకు జరగనున్న ఎన్నికల్లో ప్రచారానికి జైప్రకాశ్‌నారాయణ్ పేరు ఉపయోగించి ప్రయోజనం పొందాలని వీరు సరికొత్త వ్యూహం రచించారు. ఈ ఆలోచనతోనే జైప్రకాశ్‌నారాయణ్ జయంతిని అక్టోబరు 11 న ఆయన జన్మించిన సీతాబ్‌దియర గ్రామంలో బీజేపీ తరపున ఘనంగా నిర్వహించాలని తలపెట్టారు. ఇందుకోసం అమిత్‌షా 20 రోజుల్లో రెండోసారి బిహార్‌లో పర్యటించనున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బీజేపీకి పెద్ద షాక్ ఇచ్చారు. బీజేపీతో కలిసి ఏర్పాటు చేసిన ప్రభుత్వం నుండి వైదొలగి ఆర్‌జెడి పార్టీతో పాటు మొత్తం ఏడు పార్టీల మహా ఘట బంధన్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ బిహార్‌లో ఎక్కువ సీట్లు గెలుచుకొనే అవకాశం లేదన్న అంచనాలు, విశ్లేషణలు వచ్చాయి, మంచి పాలనాదక్షుడని నితీశ్‌కు గల పేరును ఎలాగైనా తుడిచివేసి దుష్ప్రచారం చేసేందుకు ఈ ఇరువురు నేతలు ఎత్తుగడ వేశారు. ఆర్‌జెడి బలంగా ఉంది. అలాగే నితీశ్ సమర్థ నాయకుడన్న పేరుతో పాటు రాష్ట్రంలో అనేక ప్రజానుకూల కార్యక్రమాలు అమలు చేవారని ప్రజలు విశ్వసిస్తున్నారు.

సెప్టెంబరు 23 న మొదటిసారి అమిత్‌షా బిహార్‌లో పర్యటించారు. ఆరోజు సీమాంచల్ ప్రాంతంలోని పూర్ణియాలో బహిరంగ సభ నిర్వహించి తీవ్ర నిరాశ చెందారు. పెద్దగా జనం హాజరు కాకపోవడంతో ఈ పర్యటన విఫలమైందన్న వార్తలు వచ్చాయి. సభలో మాట్లాడిన అమిత్‌షా నితీశ్ అవకాశవాది అని, నమ్మదగిన వ్యక్తి కాదని ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నించాడు. నరేంద్రమోదీ పాలనలో జరిగిన అభివృద్ధిని, నితీశ్ చేసిన అభివృద్ధిని పోల్చుకుని చూడాలని అమిత్‌షా చెప్పారు. మోదీ చేయని అభివృద్ధిని చేసినట్టుగా చెప్పడానికి ఏమీ వెనుకాడలేదు. అబద్ధాలు చెప్పడంలో ఈ నాయకులకు మరెవ్వరూ సాటిరారు. మోదీ బిహార్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని షా మరో అబద్ధం చెప్పాడు. కోవిడ్-19 మహమ్మారి విజృంభించిన సమయంలోనూ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మోదీ రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా టీకాలు వేయిస్తానని చేసిన వాగ్దానాన్ని పూర్తిగా మరిచిపోయాడు. రెండోసారి పర్యటించనున్న అమిత్‌షా గతంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుసరించిన వ్యూహాన్ని



తిరిగి అనుసరించాలని అనుకుంటున్నాడు. ఆనాడు జయప్రకాశ్‌నారాయణ్ ఆకాంక్షలను, లక్ష్యాలను గ్రహించిన ఆర్‌ఎస్‌ఎస్ ఒక వ్యూహం ప్రకారం ఆయన వెంట నడిచి ప్రయోజనం పొందింది. ఈసారి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగిని కూడా బిహార్ పర్యటనకు తీసుకురానున్నారు. సీతాబ్‌దియరా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని యోగి వాగ్దానం చేయనున్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేసి ఈ ప్రాంతంలో హిందువుల ఓట్లను గెలుచుకునే ఎత్తుగడ వేశాడు.

1977 లో అత్యంత కుట్రపూరిత ఆలోచనతో జైప్రకాశ్‌నారాయణ్‌ని ఉపయోగించుకుని ప్రధాన స్రవంతి రాజకీయాలలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రవేశించింది. ఆనాడు కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర వహించింది. లోక్‌సభ ఎన్నికలు జరగడానికి ముందు ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ సంస్థ జనసంఘ్‌ను షరతులు లేకుండా జనతాపార్టీలో విలీనం చేస్తామని కూడా వాగ్దానం చేశారు. ఆర్‌ఎఎస్, బీజేపీలు తమ లక్ష్యం నెరవేరగానే తమకు సహకరించిన వారిని బయటకు గెంటివేసే ందుకు ఏమాత్రం వెనుకాడవు. జనతా ప్రభుత్వం అధికారంలో ఉన్ననాడు గానీ బిహార్ ప్రభుత్వంలో ఉన్నంతకాలం సీతాబ్‌దియెరా గ్రామాన్ని కనీసం తలుచుకోలేదు. గాగ్రానది ఒడ్డున ఉన్న సీతాబ్‌దియరా ప్రాంత భూమి కోతకు గురి అవుతుంది. ఈ గ్రామం యూపీని ఆనుకొని ఉంటుంది. అయినప్పటికీ యోగి కానీ, మోదీ కానీ ఎనిమిదేళ్ల కాలంలో ఆ గ్రామాన్ని కోత నుండి రక్షించటానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. జైప్రకాశ్ సొంత గ్రామంలో ఆయన ఇంటిని జాతీయ వారసత్వ చిహ్నంగా ప్రకటించాలని కోరినప్పటికీ కూడా బిజేపీ ఆలోచించలేదు. అమిత్‌షా జరపనున్న పర్యటన రాజకీయ వర్గాలలో చర్చనీయాంశం అయింది. సీతాబ్‌దియరా గ్రామంలో కొంతభాగం యూపీలో ఉంటుంది. తక్కిన భాగం బిహార్ సరన్ లోక్‌సభ నియోజక వర్గంలో ఉంటుంది. ఇది పెద్ద గ్రామం. వరదల నుంచి కాపాడేందుకు ఏడున్నర కిలోమీటర్ల నదికి రింగ్ డ్యామ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించింది. నితీశ్ మొదటిసారి అమిత్‌షా పర్యటించక ముందే అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆ ప్రాంతంలో ప్రారంభించారు. 2017-18 లో రింగ్ డ్యామ్‌కు, కోత నివారణకు సంబంధించిన పనులు రాష్ట్ర పరిధిలో ఉన్న మేరకు పూర్తి చేశారు. యూపీ ప్రాంతంలో అభివృద్ధి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

జైప్రకాశ్‌నారాయణ్ శిష్యుడైన నితీశ్ బీజేపీ ఆయన పేరును వాడుకొనేందుకు వీలు లేకుండా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. రెండు మూడు రోజుల క్రితమే ఆ గ్రామంలో లైబ్రరీతో కూడిన జైప్రకాశ్‌నారాయణ్ స్మృతి భవనాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి అభివృద్ధి చేస్తానని నితీశ్ హామీ ఇచ్చారు. సీతాబ్‌దియరా గ్రామంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కూడా యోగికి నితీశ్ విజ్ఞప్తి చేశారు. మాజీ సోషలిస్టు నాయకులందరినీ సెప్టెంబరు 25 న సమావేశపరిచి ప్రతిపక్షాల ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని షా ప్రయత్నించాడు. సోషలిస్టులకు, లోహియా అనుచరులకు ఒబీసీలు, ఈబీసీలలో మంచి పలుకుబడి ఉన్నది. వీరిలో ఎక్కువ మంది హిందీ మాట్లాడే ప్రాంతంలో ఉన్నారు. నితీశ్‌కుమార్ నాయకత్వంలోని మహాఘట బంధన్ బిహార్‌లో బీజేపీ పునాదిని దెబ్బతీయగలిగింది. 2024 లో తాము 40 సీట్లు ఇక్కడ గెలుచుకుంటామని డంబాలు పలుకుతున్న బీజేపీ ఈసారి అయిదు సీట్ల కంటే ఎక్కువ గెలుచుకునే అవకాశం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నరబలి కేసులో సంచలన నిజాలు

- ఇద్దరు మహిళల్ని హత్యచేసి వండుకుతిన్న భార్యాభర్తలు
- సైకో మాటలు నమ్మి ఘోరానికి ఒడిగట్టిన వైనం

తిరువనంతపురం: నరబలి ఇస్తే ధనవంతులవుతామన్న మూఢ నమ్మకంతో కేరళలోని ఒక జంట ఇద్దరు మహిళల్ని క్రూరంగా హత్య చేసిన కేసులో మరిన్ని దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూశాయి. మృతుల శరీర భాగాల్ని నిందితులు వండుకుని తిన్నట్లు తెలిసింది. ఒక మృతదేహం 56 ముక్కలుగా నరికివేయబడిందని పోలీసులు తెలిపారు. మరికొందరిని ఇదే తరహాలో నరబలి ఇచ్చేందుకు సిద్ధమైనట్లు వెల్లడైంది. ఈ కేసులో మాంత్రికుడు రషీద్ అలియాస్ మహ్మద్ షఫీ ప్రధాన నిందితుడని పోలీసులు బుధవారం చెప్పారు. సోషల్ మీడియాను ఆసరాగా చేసుకుని అతడు ఈ దురాగతాలకు పాల్పడ్డాడని వివరించారు. 'ఇద్దరు మహిళల్ని బలి ఇచ్చాం. ఆరోగ్యంగా, ఎక్కువ కాలం బతికేందుకు వారి శరీర భాగాలు వండుకుని తినమని మాంత్రికుడు సూచించాడు. మేము అలానే చేశాం' అంటూ నరబలి కేసులో నిందితులు చెబుతున్న మాటలు విని కేరళ పోలీసులు నిర్ఘాంతపోయారు. ధనం ప్రాప్తిస్తుందన్న ఆశతో భగవల్ సింగ్, అతడి భార్య లైలా అత్యంత కిరాతకంగా వ్యవహరించిన తీరును తెలుసుకుని నివ్వెరపోయారు. ఈ కేసులో ఆధారాల సేకరణ కోసం నిందితులైన భగవల్‌సింగ్, లైలాను తిరువల్లలోని వారి ఇంటికి తీసుకెళ్లారు. షఫీ సాయంతో ఈ నేరం చేసిన తీరును సింగ్-లైలా వివరించారు. అతడి సూచనల మేరకు మృతుల శరీర భాగాల్ని వండుకుని తిన్నట్లు చెప్పారు. అయితే... ఈ విషయంపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉందని బుధవారం మీడియా సమావేశంలో కొచ్చి నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. నాగరాజు తెలిపారు. "మృతుల శరీర భాగాల్ని నిందితులు తిని ఉండొచ్చు... అయితే.. ఈ విషయంపై దర్యాప్తు జరుగుతోంది. ఇంకా ధ్రువీకరించలేదు...ఈ కేసులో ఇంకెవరైనా నిందితులు ఉన్నారా, ఇలాంటి నేరాలు ఇంకేమైనా జరిగాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. ఇద్దరు మహిళల శరీర భాగాలు అన్నింటినీ రికవర్ చేశాం" అని వెల్లడించారు నాగరాజు.

మిస్టరీ వీడిందిలా..

హత్యకు గురైన ఇద్దరు మహిళల్లో ఒకరు జూన్‌లో, మరొకరు సెప్టెంబర్‌లో అదృశ్యమయ్యారు. ఆ ఇద్దరు మహిళల కుటుంబ సభ్యులు.. వేర్వేరుగా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ కాల్ డేటా, టవర్ లోకేషన్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టగా ఈ నరబలి వ్యవహారం బయటపడింది. నరబలి ఇచ్చి, మృతదేహాల్ని ముక్కలు ముక్కలుగా నరికి, పాతేసినట్టు వెల్లడైంది. మంగళవారం పథనంతిట్ట జిల్లా ఎలంతూర్ గ్రామంలోని భగవల్-లైలా ఇంటి నుంచి ఇద్దరి మృతదేహాల్ని పోలీసులు వెలికితీసి, నిందితుల్ని అరెస్టు చేశారు. 'మహిళల అదృశ్యంపై తొలుత షఫీని ప్రశ్నించాం. కానీ మాకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. శాస్త్రీయంగా దర్యాప్తు చేస్తే పథనంతిట్ట వైపు మా దృష్టి మళ్లింది. ఈ కేసులో షఫీ ప్రధాన కుట్రదారుడు. అతడు శాడిస్టు, ఓ కామాంధుడని దర్యాప్తులో తెలిసింది' అని నాగరాజు వివరించారు.

డబ్బు ఆశ చూపి...

పోలీసుల కథనం ప్రకారం.. కడవంతర, కాలడీకి చెందిన ఇద్దరు మహిళలతో మహ్మద్ షఫీ సోషల్ మీడియాలో స్నేహం చేశాడు. లాటరీ టికెట్లు విక్రయిస్తూ జీవనం సాగించే పద్మం (52), రోస్లి(50)ని కొద్దిరోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. అనంతరం భగవల్ సింగ్ దంపతులతో కలిసి బలి ఇచ్చాడు. ప్రధాన నిందితుడు షఫీ.. ఆర్థికంగా సమస్యల్లో ఉన్న వారిని ఫేస్‌బుక్ ద్వారా గుర్తించేవాడు. అలానే భగవల్ సింగ్, లైలా గురించి తెలుసుకున్నాడు. నరబలి ఇచ్చేందుకు వారు సుముఖంగా ఉన్నట్లు కనుగొన్నాడు. ఫేస్‌బుక్‌లో ఇదంతా చేసేందుకు షఫీ తన భార్య సెల్‌ఫోన్ ఉపయోగించాడు. కానీ ఆ విషయం ఆమెకు తెలియదు. షఫీ ఎవరినైనా లైంగికంగా వేధించాడా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని, ఈ నరబలి కాకుండా వేర్వేరు నేరాలకు సంబంధించి షఫీపై 8 కేసులు నమోదైనట్లు బుధవారం మీడియా సమావేశంలో కొచ్చి డీసీపీ ఎస్.శశిధరన్ వెల్లడించారు. ఈ నరబలి కేసుకు ఆయనే ప్రధాన విచారణ అధికారిగా ఉన్నారు. మరింత మందిని నరబలి ఇవ్వాలని నిందితులు భావించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది.

పోలీసు కస్టడీకి నిందితులు

ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితుల (భగవల్, లైలా, షఫీ అలియాస్ రషీద్?)ను పోలీసులు బుధవారం ఉదయం ఎర్నాకుళం జిల్లా సెషన్స్ కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు వారికి 14 రోజుల(అక్టోబర్ 26 వరకు) పోలీస్ కస్టడీ విధించింది.

కుమార్ విశ్వాస్, బగ్గాపై ఎఫ్ఐఆర్‌ల కొట్టివేత

చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత కుమార్ విశ్వాస్, బీజేపీ నేత తేజేంద్ర పాల్ సింగ్ బగ్గా పై పోలీసులు నమోదు చేసిన రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను పంజాబ్, హర్యా హైకోర్టు బుధవారం కొట్టివేసింది. బగ్గాపై క్రిమినల్ కేసు కొనసాగింపు న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని కోర్టు వ్యాఖ్యానించింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణల కింద విశ్వాస్‌పై పంజాబ్‌లోని రూప్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేయగా, మొహాలీలో గత ఏప్రిల్‌లో విద్వేష పూరిత ప్రకటనలు చేశారనే ఆరోపణలపై బగ్గాపై ఎఫ్ఐఆర్ నమోదైంది. వేర్పాటువాద శక్తులతో కేజ్రీవాల్‌కు సంబంధాలున్నాయని విశ్వాస్ ఆరోపణలు చేయడంతో ఆయనపై అనేక సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ జస్టిస్ అనూప్ చిత్కార తీర్పు చెప్పినట్టు సీనియర్ న్యాయవాది చేతల్ మిట్టల్ తెలిపారు. పోలీస్ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పుచెప్పిన న్యాయవ్యవస్థకు కుమార్ విశ్వాస్ కృతజ్ఞతలు చెప్పారు. సత్యమేవ జయతే అంటూ బీజేపీ నేత బగ్గా ట్వీట్ చేశారు. తనపైన, కుమార్ విశ్వాస్‌పైన నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసినట్టు ఆయన తెలిపారు.

భారత్ ఆర్థిక వ్యవస్థ బాగు: ఐఎంఎఫ్

న్యూదిల్లీ : భారత్ ఆర్థిక వ్యవస్థే బాగుందని, ప్రపంచంలోని చాలాదేశాల ఆర్థిక వృద్ధి మందగమనంలో సాగుతోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) ఆసియా-పసిఫిక్ శాఖ డైరెక్టర్ కృష్ణ శ్రీనివాసన్ చెప్పారు. ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో వృద్ధి నెమ్మదిస్తోందని, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతోందని చెప్పారు. ఐఎంఎఫ్ ఆసియా-పసిఫిక్ శాఖ డైరెక్టర్ కృష్ణ శ్రీనివాసన్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను చూస్తే ఇది సర్వత్రా వేధిస్తున్న సమస్య అని అన్నారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో మూడింట ఒక వంతు ఆర్థిక వ్యవస్థ గల దేశాలు ఈ ఏడాది కానీ, వచ్చే సంవత్సరం కానీ ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే అవకాశం ఉందని తాము భావిస్తున్నామని చెప్పారు. ద్రవ్యోల్బణం విపరీతంగా ఉందన్నారు. మొత్తం మీద పరిస్థితి ఇదేనని తెలిపారు. 'దాదాపు ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తోంది. ఈ నేపథ్యంలో భారత దేశం మెరుగ్గా ఉంది. ఈ ప్రాంతంలోని ఇతర దేశాలతో పోల్చినపుడు భారత దేశం సాపేక్షంగా మెరుగైన స్థితిలో ఉంది' అని చెప్పారు. ఐఎంఎఫ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో 2022లో భారత దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు అంచనాను సవరించింది. ఈ రేటు 6.1 శాతం ఉంటుందని జోస్యం చెప్పింది. జులైలో విడుదల చేసిన నివేదికలో ఈ రేటు 7.4 శాతం అని జోస్యం చెప్పింది. ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా భారత దేశ అంచనా వృద్ధి రేటును తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ అంచనాను సవరించినప్పటికీ ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే భారత దేశ వృద్ధి వేగంగా ఉంటుందని అంచనా వేశాయి. భారత దేశం తర్వాతి స్థానాల్లో చైనా (4.4 శాతం), సౌదీ అరేబియా (3.7 శాతం), నైజీరియా (3 శాతం) ఉన్నాయి. అమెరికా వృద్ధి రేటు 1 శాతం అని, రష్యా, ఇటలీ, జర్మనీ ఆర్థిక వ్యవస్థల వృద్ధి తిరోగమనంలో ఉంటుందని జోస్యం చెప్పాయి.

గుజరాత్‌లో మరోసారి బీజేపీ గౌరవ్ యాత్ర

గాంధీనగర్ (గుజరాత్): రాబోయే గుజరాత్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్‌లో పోటీ చేయనున్నది. అయితే గుజరాత్‌లోని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉన్న గిరిజనులు ప్రస్తుతం ఆప్ వైపు దృష్టి సారిస్తున్న రాజకీయ విశ్లేషకులు చెబుతున్న తరుణంలో, బీజేపీ ప్రభుత్వం గిరిజనుల ఓట్లను కొల్లగొట్టేందుకు పావులు కదుపుతోంది. దీంతో మరోసారి గౌరవ్ యాత్ర పేరుతో వారిని తమవైపునకు తిప్పుకునేందుకు బీజేపీ అధిష్ఠానం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వరుసగా మూడోసారి బుధవారం నుంచి ఈ యాత్రను ప్రారంభించేందుకు సన్నద్ధమైంది. గతంలో బీజేపీ 2002, 2017లో ఈ యాత్రలు చేపట్టింది. అయినప్పటికీ 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్టీకి కేటాయించబడిన సీట్లలో బీజేపీ కేవలం తొమ్మిది సీట్లను మాత్రమే గెలుచుకుంది. భారతీయ గిరిజన పార్టీ (బీటీపీ) రెండు గెలుచుకోగా, మిగిలినవి కాంగ్రెస్‌కు చేరాయి. పర్-తాపి-నర్మద నదుల అనుసంధాన ప్రాజెక్టును బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడంతో గిరిజనుల నుంచి తీవ్ర నిరసనలను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ నేతృత్వంలో ఈ నిరసనలు చేపడుతుండటం గమనార్హం. 2002 గుజరాత్ అల్లర్లతో మోదీ ప్రాభవం తగ్గడంతో గౌరవ్ యాత్రను చేపట్టింది. దీంతో ఆ ఎన్నికల్లో 182 సీట్లకుగాను బీజేపీ 127 సీట్లను గెలుచుకుంది. అనంతరం మోదీ కేంద్ర రాజకీయాల్లో బిజీగా మారిపోయారు. దీంతో 2017లో గుజరాత్‌లో బీజేపీ కేవలం 99 సీట్లతో.. కనిష్ఠ స్థాయికి చేరింది.

మైదెన్ ఫార్మాకు హరియాణా నోటీసు

చండీగఢ్: దగ్గు సిరప్‌తో పిల్లల మరణాలకు కారణమైన మైదెన్ ఫార్మాసూటికల్స్ ఫ్యాక్టరీ 12 నిబంధనలను ఉల్లంఘించిందని, తనిఖీల్లో ఈ విషయం బయటపడిందని హరియాణా ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ ప్రకటించారు. అందువల్ల ఉత్పత్తిని నిలిపివేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని సోనెపట్ పట్టణంలో ఉన్న ఫ్యాక్టరీలో అధికారులు తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఔషధాల ఉత్పత్తికి హరియాణా రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ విధించిన నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైదెన్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ చెప్పే విషయాలనూ పరిశీలిస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) బుధవారం ప్రకటించింది. నిబంధనలు ఉల్లంఘించినందున సంస్థ తయారీ లైసెన్సును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం 1940లోని 85(2), 1945 నిబంధనల ప్రకారం మైదెన్ ఫార్మాకు రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ-లైసెన్సింగ్ యంత్రాంగం, హరియాణా ఆహార, ఔషధ నిర్వహణ విభాగం నోటీసు జారీ చేసింది. దీనిపై ఈ వారాంతంలోగా సమాధానం ఇవ్వాలని సూచించింది. ఈ సంస్థ నిబంధనలను తీవ్రంగా అతిక్రమించిందని రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ తన ఏడు పేజీల షోకాజ్ నోటీసులో పేర్కొంది.

అవయవ దాతల కుటుంబంతో రాహుల్

చిత్రదుర్గ్ (కర్ణాటక): భారత్ జోడో యాత్రకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బుధవారం అవయవాలను దానం చేసిన వారి కుటుంబాలతో కలిసి నడిచి, అవయవదానం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడితో కలిసి పాదయాత్ర చేస్తున్న దాదాపు 30 మంది 'భారత్ యాత్రికులు' తమ కళ్లను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారని పార్టీ తెలిపింది. అవయవదానం చేసిన మోటార్ సైకిల్ ప్రమాదంలో మరణించిన జాతీయ చలనచిత్ర అవార్డు గెలుచుకున్న ఉత్తమ నటుడు దివంగత సంచారి విజయ్, హుబ్బళ్లి ధార్వాడ్ బైపాస్ హైవేపై ప్రమాదానికి గురై మరణించిన వేద మంజునాథ్, బస్సు నుంచి పడి తలకు గాయమై మరణించిన చిక్కమగళూరు జిల్లాకు చెందిన పీయూసీ విద్యార్థిని రక్షిత కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ కలిసి నడిచారు. యాత్ర 35వ రోజు ఉదయం 6:40 గంటలకు చల్లకెరె నుంచి ప్రారంభమయింది. రోజంతా చారిత్రాత్మకమైన చిత్రదుర్గ జిల్లాలో ప్రయాణిస్తుంది.

బస్సు దగ్ధం... ప్రయాణికులు సురక్షితం

న్యూదిల్లీ: పూణెలో ఓ ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతైంది. బుధవారం జరిగిన ఈ ప్రమాదం నుంచి 27మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు ప్రకటించారు. వీరిలో 23 మంది మహిళలు కాగా, ముగ్గురు పురుషులు ఉన్నారు. థానే జిల్లాకు చెందిన 27 మంది ప్రయాణికులు మంగళవారం రాత్రి భీమశంకర్ దేవాలయానికి వెళ్లేందుకు ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున బస్సు గోడెగావ్‌లోని భీమ శంకర్ రోడ్‌కు చేరుకోగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను హెచ్చరించారు. వారంతా బస్సు నుంచి కిందకి దిగారు. మంటలు వ్యాపించడంతో బస్సుతో పాటు వారి లగేజీ పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. గతవారం మహారాష్ట్రలోని నాసిక్ హైవేపై జరిగిన బస్సు ప్రమాదంలో 12 మంది ప్రయాణికులు మరణించిన సంగతి తెలిసిందే.

వృద్ధి, ధరల అదుపు లక్ష్యంగా బడ్జెట్ నిర్మలా సీతారామన్

వాషింగ్టన్: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఏడాది బడ్జెట్‌ను అత్యంత జాగ్రత్తగా రూపకల్పన చేస్తారట! వృద్ధి సాధన, ద్రవ్యోల్బణం సమస్య పరిష్కారం దృష్టితో ఈ బడ్జెట్‌ను రూపొందిస్తారట! ఇంతకాలం గాలికొదిలేసిన ఈ విషయాలపై ఇప్పుడు దృష్టి కేంద్రీకరిస్తారట. ఈ విషయాలు చెప్పింది కూడా మనదేశంలో కాదు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల కోసం వాషింగ్టన్‌కు వెళ్ళిన ఆమె అక్కడ ప్రఖ్యాత బ్రూకింగ్స్ ఇనిస్టిట్యూట్‌లో ప్రముఖ ఆర్థిక వేత్త ఈశ్వర్ ప్రసాద్‌తో జరిపిన మాటామంతీలో పేర్కొన్నారు. వచ్చే ఏడాది బడ్జెట్ గురించి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. బాగా మందగించిన వృద్ధిరేటు, విపరీతంగా పెరిగిన ద్రవ్యోల్బణం పెద్ద సవాళ్ళుగా వేధిస్తున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను బహు శ్రద్ధతో రూపొందించాలని, అది నిలకడైన వృద్ధి సాధన, ధరల అదుపునకు ఉపకరించేలా ఉండాలని అన్నారు. సమీప భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోబోయే అతి పెద్ద సమస్యల్లో ఇంధన ధరల పెరుగుదల కూడా ఒకటని ఆమె అన్నారు. ఇంకా చాలా కాలం ఉన్నందున వచ్చే బడ్జెట్ గురించి ఇప్పుడే మాట్లాడడం కొంచెం కష్టమే.. దీర్ఘదృష్టితో చూసినప్పుడు ఖచ్చితంగా వృద్ధి ప్రాధాన్యతలకు అగ్రస్థానం ఇవ్వాలి.

'భాషాయుద్ధం' ప్రారంభించొద్దు

కేంద్రానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై: 'కొత్త భాషా యుద్ధం మొదలు పెట్టకండి- భారత ఐక్యతను కాపాడండి' అంటూ కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. హిందీ తప్పనిసరి భాషగా పేర్కొంటూ మరో 'భాషాయుద్ధం' ప్రారంభించకూడదని ఆయన కోరారు. ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని.. దేశ ఐక్యతను కాపాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. హిందీ భాషపై పార్లమెంటరీ ప్యానెల్ చేసిన సిఫారసులను స్టాలిన్ వ్యతిరేకించారు. అన్ని సెంట్రల్ టెక్నికల్, నాన్-టెక్నికల్ సంస్థలతో పాటు సెంట్రల్ వర్సిటీల్లో బోధనా మాధ్యమంగా ఇంగ్లీష్ స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలని ప్యానెల్ చేసిన సిఫార్సుల్లో ఐఐటీలు, ఐఐఎంలు, ఏఐఐఎంలు, కేంద్ర విద్యాలయాల వంటి సంస్థలు ఉన్నాయి. ఈ సిఫార్సులను అమలు చేస్తే దేశ ఐక్యత నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో తమిళంతో సహా మరో 22 భాషలకు సమాన హోదా ఇచ్చారని ఈ సందర్భంగా స్టాలిన్ గుర్తు చేశారు. దేశంలో హిందీని ఉమ్మడి భాషగా సిఫారసు చేసే అవసరం ప్యానెల్‌కు ఎందుకు వచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. 'హిందీకి ప్రాధాన్యత ఇవ్వడానికి యూనియన్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో ఇంగ్లీష్ భాషా ప్రశ్నపత్రాలను నిలిపివేయాలని ఎందుకు సిఫార్సు చేశారు' అని స్టాలిన్ ప్రశ్నించారు. దేశం మొత్తానికి ఒక భాషను ఉమ్మడిగా చేయడం ఆచరణాత్మకంగా అసాధ్యమన్నారు. ఇలా ఒక భాషను తప్పనిసరి చేయడం వల్ల దేశంలో హిందీ మాట్లాడే వారు మాత్రమే సరైన పౌరులు, ఇతర భాషలు మాట్లాడే వారు ద్వితీయ శ్రేణి పౌరులు అని చెప్పడంతో సమానం అవుతుందని స్టాలిన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో నిర్వహించిన హిందీ దివాస్ (సెప్టెంబర్ 14) సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కూడా స్టాలిన్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లోని అన్ని భాషలను కేంద్రం అధికారిక భాషలుగా పరిగణించాలని, దేశ సంస్కృతి, చరిత్రను బలోపేతం చేయడానికి 'హిందీ దివాస్' బదులుగా సెప్టెంబర్ 14న 'భారతీయ భాషల దినోత్సవం'గా పాటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రికి భాషలపై శ్రద్ధ ఉంటే సంస్కృతం, హిందీతో సమానంగా దేశంలోని అన్ని భాషలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని భాషల అభివృద్ధికి చర్యలు తీసుకోకుండా జాతీయ విద్యా విధానం ద్వారా హిందీని అందరిపై రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోందని స్టాలిన్ ఆరోపించారు. దేశ సంస్కృతి, చరిత్రను అర్థం చేసుకోవాలంటే హిందీ నేర్చుకోవాలని చెప్పడం అంటే వివిధ భాషలు మాట్లాడే వ్యక్తులతో నిండి ఉన్న భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి విరుద్ధమని తెలిపారు. భారత సంస్కృతి, చరిత్ర హిందీలోనే దాగి ఉండవని, తమిళ నేతృత్వంలోని ద్రావిడ భాషా కుటుంబం నేటి భారతదేశం, దాని వెలుపల విస్తరించిన చరిత్రకారులు ఎలా చూపుతున్నారని స్టాలిన్ గుర్తు చేశారు.

జమ్ములోకి సెట్లర్లు... వ్యతిరేకిస్తాం: పీడీపీ

శ్రీనగర్ : జమ్ములో కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడాన్ని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ బుధవారం విమర్శించారు. కేంద్రప్రభుత్వ వలసవాద సెటర్ల ప్రాజెక్టు తమ ప్రాంతంలో మొదలైందని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్ మధ్య మతం, ప్రాంతీయపరమైన విభజనలను సృష్టించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కశ్మీరీలైనా.. డోగ్రాలైనా ప్రతి ఒక్కరి గుర్తింపు, హక్కుల పరిరక్షణ ఐక్యపోరాటంతోనే సాధ్యమని ఆమె నొక్కిచెప్పారు. ఈసీఐ తాజా ఆదేశాలతో జమ్మూలో సెట్లర్ల ప్రాజెక్టు మొదలైందని స్పష్టమవుతోందని, ఇది డోగ్రా సంస్కృతికి, గుర్తింపు, ఉపాధి, వాణిజ్యానికి దెబ్బ అని ముఫ్తీ ట్వీట్లు చేశారు. ఓటర్ల జాబితాల సమీక్షపై ప్రత్యేక చర్యలు కొనసాగుతున్న క్రమంలో వాటిలో నమోదుకు అవకాశం కల్పించేలా ఏడాదికిపైగా శీతాకాల రాజధాని ప్రాంతంలో ఉంటున్న వారి నుంచి నివాస పత్రాలు జారీ చేసే అధికారాన్ని తహశీల్దార్లు (రెవెన్యూ అధికారులకు) మంగళవారం జమ్మూలోని అధికారులు ఇచ్చిన క్రమంలో ముఫ్తీ స్పందించారు. ఆమె దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో విలేకరులతో మాట్లాడారు. అధికరణ 370 రద్దు వెనుక బీజేపీ దురుద్దేశం ఉన్నదని చాలా ఏళ్లుగా తమ పార్టీ చెబుతూనే ఉందని అన్నారు. జమ్మూకశ్మీర్ జనాభా నిష్పత్తిని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇది జమ్మూ నుంచి మొదలవుతుంది. బయట వ్యక్తులు పెద్ద సంఖ్యలో జమ్మూకు తరలివస్తారు. తద్వారా డోగ్రా సంస్కృతితో పాటు వ్యాపారాలు, ఉద్యోగాలు, వనరులపై దాడులు తప్పవు. బయట వ్యక్తులకు ద్వారాలు తెరుస్తుండటంతో నేరనిష్పత్తి బాగా పెరుగుతుంది. తమ భవిష్యత్, గమ్యం, లక్ష్యాలన్నీ ఒక్కటే అన్న విషయాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలు గ్రహించాలి. కార్గిల్, లేహ్, లధక్ ప్రజలు ఏ విధంగా బీజేపీ విభజించి పాలింపు విధానాన్ని తిప్పికొట్టారని, తమ భూములు, ఉద్యోగాలను రక్షించుకునేందుకు ఏకమయ్యారని, ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా బీజేపీకి గుణపాఠం నేర్పాలని, బయట నుంచి వచ్చి కనీసం ఇక్కడ ఇల్లు కూడా లేకపోయినా ఓటు హక్కులను పొందడాన్ని వ్యతిరేకించాలని ముఫ్తీ పిలుపునిచ్చారు. బీజేపీకి లబ్ధి జరిగే విధంగానే జమ్మూకశ్మీర్ డీలిమిటేషన్ ప్రక్రియ జరిగిందని అన్నారు. అయినప్పటికీ జమ్మూ ప్రజలు తమకు వ్యతిరేకమన్న భావన బీజేపీలో ఉన్నదని, అందుకే ఈ విధంగా లబ్ధి పొందేందుకు కుయుక్తులు ప్రదర్శిస్తోందని ఎన్నికల ప్రక్రియనుద్దేశించి మెహబూబా ముఫ్తీ అన్నారు.

ఎన్నికలంటే బీజేపీకి భయం : నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ కాన్ఫరెన్స్ కూడా ఇదే విషయంలో స్పందించాయి. చిత్తు అవుతుందని తెలుసు కాబట్టే ఎన్నికలంటే బీజేపీ భయపడుతోందని ఎన్‌సీ పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో 25లక్షల బయట వ్యక్తులను ఓటర్లుగా చేర్చి లబ్ధి పొందాలని కేంద్రం భావిస్తోందని ట్వీట్ చేసింది. బ్యాలెట్ ద్వారా వారి కుట్రలను జమ్మూకశ్మీర్ ప్రజలు ఓడించాలని రెండు పార్టీలు పిలుపునిచ్చాయి.

సీడబ్ల్యూసీ ఎన్నికలు జరుపుతా

పార్టీ పార్లమెంటరీ బోర్డు పునరుద్ధరణ కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి శశి థరూర్

న్యూదిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయినట్లయితే సీడబ్ల్యూసీ ఎన్నికలకు, పావు శతాబ్ద కాలంగా నిద్రాణంగా ఉన్న పార్లమెంటరీ బోర్డు పునరుద్ధరణకు అవసరమయ్యే పార్టీ ప్రస్తుత రాజ్యాంగాన్ని తాను పూర్తిగా అమలు చేస్తానని కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి శశి థరూర్ బుధవారం తెలిపారు. చేస్తానని అన్నారు. కాంగ్రెస్ తప్పనిసరిగా అధికారాన్ని వికేంద్రీకరించాలని, క్రింది స్థాయిలో ఉన్న పార్టీ ఆఫీసు బేరర్లకు నిజమైన అధికారాన్ని కల్పించాలని థరూర్ పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ఈ ఏడాది మొదట్లో పార్టీ చింతన్ శిబిరంలో ఏకగ్రీవంగా ఆమోదించిన ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను తాను పూర్తిగా అమలు చేస్తానని తిరువనంతపురం లోక్‌సభ ఎంపీ చెప్పారు. అత్యున్నత పదవికి జరిగే ఎన్నికల్లో మల్లికార్జున్ ఖర్గే పై గెలిస్తే... పార్టీ కోసం అతని ప్రణాళికల గురించి అడిగిన ప్రశ్నకు, కేంద్ర మాజీ మంత్రి థరూర్ మాట్లాడుతూ 'మా అంతర్గత పార్టీ ప్రజాస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు వర్కింగ్ కమిటీకి ఎన్నికలను పిలవడం ఒక ముఖ్యమైన మొదటి అడుగు. సీడబ్ల్యూసీ ఎన్నికలు, పావు శతాబ్ద కాలంగా నిద్రాణంగా ఉన్న పార్లమెంటరీ బోర్డు పునరుద్ధరణకు అవసరమైన ప్రస్తుత రాజ్యాంగాన్ని ఏకగ్రీవంగా ఆమోదించబడిన ఉదయపూర్ డిక్లరేషన్‌ను నేను పూర్తిగా అమలు చేయబోతున్నాను' అని థరూర్ చెప్పారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం, పార్లమెంటరీ బోర్డు పునరుద్ధరణ వంటివి 2020లో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేయాలని కోరుతూ పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి లేఖ రాసిన థరూర్‌తో సహా 23 మంది నేతల బృందం కీలకమైన డిమాండ్‌లలో ఒకటి. చింతన్ శిబిరంలో కాంగ్రెస్ ఉదయపూర్ డిక్లరేషన్‌ను ఆమోదించింది. ఇందులో 50 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారికి విస్తృత ప్రాతినిధ్యం, 'ఒక వ్యక్తికి ఒక పదవి', 'ఒక కుటుంబానికి ఒక టికెట్' సహా తదుపరి దఫా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమరానికి సిద్ధం చేసేందుకు విస్తృత స్థాయి సంస్థాగత సంస్కరణలు ఉన్నాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు, బ్లాక్, మండల, బూత్ అధ్యక్షులకు నిజమైన అధికారం ఇవ్వడం ద్వారా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని తప్పనిసరిగా బలోపేతం చేయాలని తన మేనిఫెస్టోలో సూచించినట్లు థరూర్ అన్నారు. 'మేము అధికారాన్ని వికేంద్రీకరించాలి. పార్టీ అట్టడుగు స్థాయి ఆఫీస్ బేరర్లకు నిజంగా అధికారం ఇవ్వాలి. ఉదాహరణకు, మా పీసీసీ ప్రతినిధులకు గత 22 సంవత్సరాలుగా అక్షరార్థంగా ఎటువంటి పాత్ర లేదు. వచ్చే అక్టోబర్ 17న జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలి' అని 66 ఏళ్ల నాయకుడు అన్నారు. 'ఏదైనా సీనియర్ నాయకులు వచ్చినప్పుడు వేదిక పై పీసీసీ ప్రతినిధులకు చోటు కల్పించడం, ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేసే ముందు జరిగే సంప్రదింపులలో వారు పాల్గొనడం, మొదలైన వాటి ద్వారా వారి ఎన్నికయిన హోదాను గౌరవించాలని నేను కోరుకుంటున్నాను' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ తన పార్టీ, పాలనా వ్యవహారాల్లో బీజేపీ 'అధికార కేంద్రీకరణ'కి విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలని థరూర్ నొక్కి చెప్పారు. 'నేను 2014 యూపీఏ ఎన్నికల నినాదమైన 'మెయిన్ నహిన్, హమ్' నినాదానికి పెద్ద అభిమానిని. సంస్థను తిరిగి ఊహించడం, అట్టడుగు స్థాయి నాయకులకు అధికారాలను అప్పగించడం, మా విజయంలో భాగస్వామ్యులుగా మా కార్యకర్తలను శక్తిమంతం చేయడం, కొత్త అధ్యక్షుడిని అధిక పరిపాలన భారం నుంచి విముక్తి చేయడమే కాకుండా, గత యుగాలలో బలమైన రాష్ట్ర నాయకత్వాన్ని పునః సృష్టించడంలో సహాయపడుతుంది' అని ఆయన అన్నారు.

'అధికారిక అభ్యర్థి' మీడియా సృష్టే: ఖర్గే

న్యూదిల్లీ: 'అధికారిక అభ్యర్థి' అనేది మీడియా సృష్టేనని కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్న మల్లిఖార్జున ఖర్గే చెప్పారు. తాను క్షేత్ర స్థాయి కార్యకర్తనని, ప్రతినిధులే తనను ఎంపిక చేశారని, పోటీ చేయాలని తనను నాయకులు కోరారని చెప్పారు. ఓ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలు ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్ఠానం, గాంధీలు సూచించిన అనధికారిక అధికారిక అభ్యర్థి మీరేనా? అని అడిగినపుడు ఖర్గే స్పందిస్తూ, 'నేను కేవలం క్షేత్ర స్థాయి కార్యకర్తను. ప్రతినిధులే నన్ను ఎంపిక చేశారు. నాయకులు పోటీ చేయమని నన్ను కోరారు' అని తెలిపారు.

'అందరు సీనియర్ నేతలు, పీసీసీ అధ్యక్షులు, నన్ను ప్రతిపాదించినవారు, ఇతర డెలిగేట్లు నాకు ఫోన్ చేశారు. గాంధీ కుటుంబం బరిలో లేకపోతే, ఈ ఎన్నికల్లో మీరు పోటీ చేయండి అని నన్ను అడిగారు. చాలా మంది సీనియర్ నేతలు, డెలిగేట్ల కోరిక మేరకు, నేను పోటీ చేస్తున్నాను" అని ఖర్గే చెప్పారు. ఖర్గేకు 50 ఏళ్లకు పైబడిన రాజకీయ అనుభవం ఉంది. ఆయన తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగారు. కాంగ్రెస్ పార్టీలో అధికారాన్ని వికేంద్రీకరిస్తానని శశి థరూర్ చెబుతున్న విషయాన్ని ప్రస్తావించినపుడు ఖర్గే మాట్లాడుతూ, ఆయనతో తనను పోల్చవద్దని చెప్పారు. తాను బ్లాక్ ప్రెసిడెంట్ స్థాయి నుంచి వచ్చానని, ఆ సమయంలో శశి థరూర్ ఉన్నారా? అని అడిగారు. శశి థరూర్ ప్రకటించిన మేనిఫెస్టోతో ఆయన ముందుకు వెళ్లవచ్చునని చెప్పారు. అయితే తన ఎజెండా మాత్రం ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడమేనని స్పష్టం చేశారు. అందరు సీనియర్ నేతలు, నిపుణులతో సంప్రదించిన తర్వాత ఈ డిక్లరేషన్‌ను రూపొందించినట్లు వివరించారు. పార్టీని ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేయడానికి, మార్పు తేవడానికి యువ నాయకత్వం అవసరం ఉందా? అని ప్రశ్నించినపుడు ఖర్గే మాట్లాడుతూ, తాను "ఆర్గనైజేషనల్ మ్యాన్"నని చెప్పారు. పార్టీలో ఎవరు ఏమిటో తనకు తెలుసునన్నారు. యువత సేవలను ఎక్కడ అవసరమైతే అక్కడ తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న శశి థరూర్ ఈ నెల 7న మేనిఫెస్టోను విడుదల చేశారు. పార్టీని పునరుజ్జీవింపజేయడం, మళ్లీ బలోపేతం చేయడం, కార్యకర్తలను సాధికారులను చేయడం, అధికారాన్ని వికేంద్రీకరించడం, ప్రజలతో మమేకమవడం వంటి 10 అంశాలను ప్రస్తావించారు. ఈ పది అంశాలను అమలు చేస్తే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, బీజేపీని ఎదుర్కొనడానికి రాజకీయంగా దీటుగా ఎదగవచ్చునని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు ఈనెల 17న జరుగుతాయి. దాదాపు 9,000 మంది కాంగ్రెస్ ప్రతినిధులు ఓటు వేసేందుకు అర్హులు. ఈనెల 19న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

చంద్ర రాజేశ్వరరావు, అంబేద్కర్‌కు రాజా నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా నివాళు లర్పించారు. పార్టీ జాతీయ 24వ మహాసభలను పురస్కరించుకుని ఆయన ఢిల్లీ నుంచి బుధవారం విజయవాడకు చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు గన్నవరం విమానాశ్రయంలో రాజాకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి తొలుత పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ దగ్గరకు విచ్చేశారు. ముందుగా సీపీఐ అగ్ర నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అతుల్‌కుమార్ అంజన్, జైన్ పల్లవసేన్ గుప్తా, మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు, పి.హరినాథ్‌రెడ్డి, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, పార్టీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రదర్శకులకు సూచనలు

విశాలాంధ్ర-విజయవాడ : భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 14వ తేదీన జరిగే మహా ప్రదర్శనకు వివిధ జిల్లాల నుంచి వస్తున్న వాహనదారులకు ఈ క్రింది సూచనలను పాటించవలసిందిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావులు తెలిపారు.

- ఇబ్రహీంపట్నంవైపు నుంచి వచ్చే మినీ వాహనాలు గొల్లపూడి బైపాస్ రోడ్డు నుంచి చిట్టినగర్ సొరంగం, ఎర్రకట్ట మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రారంభ స్థలానికి (మీసాల రాజారావు బ్రిడ్జి) చేరుకోవాలి. అక్కడ ప్రదర్శకులను దించిన వాహనాలు బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో పార్క్ చేసుకొని, సభానంతరం స్టేడియం వద్దకు వచ్చి ప్రదర్శకులను ఎక్కించుకోవాలి.
- ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే బస్సులు, లారీలు గొల్లపూడి బైపాస్ రోడ్డు నుంచి కబేళా, చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్, పైపుల రోడ్డు, సింగ్ నగర్ ఫ్లై ఓవర్ మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రారంభ స్థలానికి చేరుకోవాలి. ప్రదర్శకులను దించిన వాహనాలు ఫుడ్ జంక్షన్ పెడస్టల్ రోడ్డు వద్ద పార్క్ చేయాలి.
- గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ మీద నుంచి రామవరప్పాడు జంక్షన్ మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రారంభ స్థలానికి చేరుకోవాలి. ప్రదర్శకులను దించిన తరువాత వాహనాలు జింఖానా గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- బందరు రోడ్డు వైపు నుంచి వచ్చే వారు తాడిగడప నుంచి వంద అడుగుల రోడ్డుగుండా ఏలూరు రోడ్డుకు వచ్చి రామవరప్పాడు మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రారంభస్థలానికి చేరుకోవాలి.
- ఏలూరు రోడ్డుపై వచ్చే వాహనాలు నేరుగా రామవరప్పాడు, పడవల రేవు నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రారంభ స్థలానికి చేరుకోవాలి.



విద్యుద్దీపకాంతుల్లో
మంగళగిరి వేములపల్లి శ్రీకృష్ణ భవన్ (సీపీఐ కార్యాలయం)

గన్నవరం విమానాశ్రయంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పల్లవ్‌సేన్ గుప్తా, అనీ రాజాకు స్వాగతం పలుకుతున్న రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఓబులేసు, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, మనోహర్ నాయుడు తదితరులు

ఎర్రజెండాలతో ముస్తాబు!

అతిథులను స్వాగతిస్తోన్న ఇబ్రహీంపట్నం కూడలి

విశాలాంధ్ర-విజయవాడ(ఇబ్రహీంపట్నం): విజయవాడలో ఈ నెల 14 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలను పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లాలోని ప్రధాన కూడళ్లు అరుణవర్ణాన్ని సంతరించుకున్నాయి. ప్రధానంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ ఎర్రజెండాలతో ముస్తాబై అతిథులను స్వాగతిస్తోంది. ఎర్రతోరణాలు, ప్రభలు, సీపీఐ జెండాలతో సుందరంగా అలంకరించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సీహెచ్.దుర్గా కోటేశ్వరరావు, కన్నా వెంకటేశ్వరరావు, ధనేకుల శ్రీనివాసరావు, కృష్ణ, షేక్ సుభానీ, సందిపాముల నాగేశు, గురవయ్య, బాణవతు వెంకట నాయక్, మాణిక్యాలరావు, ద్రోనాద్రి శ్రీను, ఆనందబాబు, ప్రసాద్ తదితరులు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్న అలంకరణకు సారథ్యం వహించారు.

మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కేరళ రాష్ట్రం కొల్లం నుంచి అక్టోబర్ 5వ తేదీన ప్రారంభమైన యువ కమ్యూనిస్టుల ఫ్లాగ్‌మార్చ్...బుధవారం నెల్లూరుకు చేరుకుంది. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వచ్చిన జాతీయ యువజన నేతలకు స్థానిక సీపీఐ స్థానిక నాయకులు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. సీపీఐ జిందాబాద్, జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి అన్న నినాదాలతో బైపాస్ సర్కిల్ దద్దరిల్లింది. అనంతరం ర్యాలీ నెల్లూరు నగరంలోని వేదాయపాలెం ఆర్టీసీ వీఆర్సి సెంటర్, గాంధీ బొమ్మ కనక మహల్ సెంటర్ మీదుగా ఏసీ సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ మాట్లాడుతూ... విజయవాడలో ఈ నెల 14 నుంచి జరిగే సీపీఐ జాతీయ మహాసభలలో కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టడానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. దేశంలో లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ, దానికి వత్తాసు పలుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలను కూడా ప్రజలు గమనిస్తున్నారని, వారందరికీ తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పే రోజు తొందరలోనే వస్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ... నల్లధనం వెలికి తీస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నదులు అనుసంధానం చేస్తామని, నూతన పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్న నరేంద్ర మోదీ... చివరికి ఏ ఒక్క హామీ నెరవేర్చలేని అసమర్థ ప్రధానిగా మిగిలిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ.1.30 లక్షల అప్పు మిగిల్చిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ రాజకీయాలు, ఆర్థిక విధానాల కోసం ఈ నెల 14నుంచి విజయవాడలో నిర్వహించనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలు వేదికగా మారనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేంద్రసాయి, మధు, సిరాజ్, షాన్‌వాజ్, నందయ్య, జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, ఆదినారాయణ, మున్నా, ఏడుకొండలు, ఆంజనేయులు, నెల్లూరు నగర సీపీఐ నాయకులు ప్రద్యుష్, స్టాలిన్, ముక్తియార్, పవన్ కిషోర్, మస్తాన్, సుబాని తదితరులు పాల్గొన్నారు. బైక్ ర్యాలీలో గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకుడు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఫ్లాగ్‌మార్చ్ తొలుత తిరుపతి జిల్లా గూడూరు నుంచి నెల్లూరుకు చేరుకుంది.

ఎరుపెక్కిన నాయుడుపేట

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట పట్టణం బుధవారం అరుణవర్ణం పులుము కుంది. రాష్ట్రంలోకి మంగళవారం ప్రవేశించిన యువ కమ్యూనిస్టుల ఫ్లాగ్‌మార్చ్... బుధవారం నాయుడుపేటకు చేరుకుంది. కేరళ రాష్ట్రం, కొల్లం నగరం నుంచి ద్విచక్ర వాహనాలపై వస్తున్న జాతీయ నాయకులకు ఘన స్వాగతం లభించింది. సీపీఐ జెండాలు, తోరణాలతో పట్టణం ఎరుపెక్కింది. స్థానిక కమ్యూనిస్టు నాయకులతో కలిసి జాతీయ నాయకులు... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడకు విచ్చేసిన కమ్యూనిస్టు కార్యకర్తల ఉద్దేశించి ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుఖ్‌జిందర్ మహేష్ సింగ్, తిరుమలై రామన్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ మాట్లాడుతూ... భారతదేశంలో లౌకిక వాదాన్ని విచ్ఛిన్నం చేస్తున్న మతోన్మాదుల్ని తరిమి కొడదాం అని పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంస్థలన్నీ కార్పొరేట్ శక్తుల పరమవుతున్నా యన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని చెప్పారు. విజయవాడ నగరంలో సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 14వ తేదీన జరిగే మహా ప్రదర్శన, బహిరంగసభను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయుడు పేట డివిజన్ కార్యదర్శి రామచంద్రయ్య, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వల్లివుల్లా ఖాద్రి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏఐవైఎఫ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మోదుగుల వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి సూర్యనాగేంద్రబాబు, సీపీఐ నగర జాయింట్ సెక్రెటరీ బాలు వసుంధర, కిరణ్, వెంకటరమణ, విద్యార్థులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభల
విజయాన్ని కాంక్షిస్తూ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: విజయవాడలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహా సభల విజయవంతాన్ని కాంక్షిస్తూ బుధవారం రాజమహేంద్రవరంలో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో పెరవలి, గోపాలపురం, బీమోలు, రాజమండ్రి, గోకవరం, కోరుకొండ, నల్లజర్ల తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సంద ర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ, మహాసభల ప్రధాన లక్ష్యం బీజేపీని ఓడించి దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే ప్రధాన అజెండా అన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికి మోదీని ఓడించాలని పిలుపు నిచ్చారు. 47 ఏళ్ల తర్వాత జాతీయ మహాసభలకు మన రాష్ట్రం ఆతిథ్యం ఇస్తుందని చెప్పారు. 1961, 75లో మహాసభలు నిర్వహించిన చరిత్ర

వాడవాడల ప్రచారం ముమ్మరం

విజయవాడ గడ్డకు ఉందన్నారు. మహాసభలకు వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. వేలాది మందితో భారీ ప్రదర్శన జరుగుతుందని, అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. బైక్ ర్యాలీలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కొండ్రపు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొమ్మసాని రవిచంద్ర, చింతలపూడి సునీల్, ఆచంట సత్యనారాయణ, కే జ్యోతి రాజు, నల్ల భ్రమరాంబ, నగర కార్యవర్గ సభ్యుడు సేపేని రవణమ్మ, నవరోజి, వానపల్లి సూర్యనారాయణ, జట్లు సంఘం కోశాధికారి కాళ్ళ అప్పలనాయుడు, సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు తరలిన ఎర్రదండు

విశాలాంధ్ర-చల్లపల్లి: సీపీఐ 24వ జాతీయ మహాసభలు ఈనెల 14 నుంచి 18 వరకు విజయవాడలో జరగనున్నాయి. ఈ మహాసభలకు కృష్ణాజిల్లా దివి ప్రాంతం నుంచి ఎర్రదండు కదిలివెళ్లింది. భూ పోరాట యోధుడు, కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్వగ్రామమైన మంగళాపురం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాదయాత్రగా మహాసభకు తరలి వెళ్లారు. తొలుత నాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఇంటీవద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్ల ర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు కిలారు వెంకయ్య జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర మంగళాపురం నుంచి లక్ష్మీపురం, చల్లపల్లి, వక్కలగడ్డ, చిట్టూర్పు, కొడాలి, మొవ్వ, కూచిపూడి మీదుగా వీరంకిలకు వరకు సాగింది. దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. 'జిందాబాద్ భారత కమ్యూనిస్టు పార్టీ' 'జయప్రదం చేయాలి సీపీఐ జాతీయ మహాసభలను' అంటూ నినాదాలతో రహదారులు మారుమోగాయి. పార్టీ నాయకులు ఎర్రజండాలు చేతపట్టి పాదయాత్ర చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 14 నుంచి 18 వరకు జరిగే జాతీయ మహాసభలకు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్వగ్రామం నుంచి ఆయన ప్రభతో భారీ పాద యాత్రగా మహాసభలకు నాయకులు బయలుదేరారని తెలిపారు. ఉద్యమాల పురిటి గడ్డ దివి ప్రాంతం నుంచి మహాసభలకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. జాతీయ మహాసభలకు అంతర్జాతీయ వామపక్ష పార్టీల అగ్ర నాయకులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రాజా, జాతీయ కార్యదర్శి కే నారాయణ, సీపీఐ పార్లమెంటరీ పక్ష నాయకుడు కామ్రేడ్ బినయ్ విశ్వం, జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, సీపీఐ తెలంగాణ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తితో పాటు అనేకమంది ప్రముఖులు హాజరవు తారని, ఈ చారిత్రాత్మక ఘట్టానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రతి గ్రామ శాఖ నుంచి ప్రజలను చైతన్యం చేసి 14న జరిగే ప్రజా ప్రదర్శనకు, మహాసభలకు జన సమీకరణ చేసి తరలి వచ్చే విధంగా స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రజా పోరాటలకు పురిటి గడ్డ, రాష్ట్ర రాజకీయ రాజధానిగా పేరుగాంచిన విజయవాడ నగరంలో మరో చరిత్రాత్మక ఘట్టం తలపెట్టినట్టు పేర్కొన్నారు. గతంలో సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతంగా నిర్వహించిన ఘనత విజయవాడకు ఉందన్నారు. గత చరిత్రను తిరగ రాసే విధంగా ఈ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, పార్టీ సీనియర్ నాయకులు పర్చూరి శ్రీనివాసరావు, మాలెంపాటి కాంచనరావు, డొక్కు చింతయ్య, గుత్తికొండ రామారావు, రావి బాబురావు, కొర్రపాటి ముఖర్జీ, చంద్ర సుబ్బారావు, ఆంజనేయులు, డొక్కు శ్రీనివాసరావు, డొక్కు నాగేశ్వరరావు, మాలంపాటి కోటేశ్వరరావు, గద్దె పూర్ణచంద్రరావు, కొల్లూరి శ్రీధర్, మహిళా సమాఖ్య నాయకులు కంచర్ల ప్రభు కుమారి, కంఠంనేని జోత్స్నా దేవి, గుత్తికొండ కీర్తి, బొబ్బ రత్నకుమారి, పరుచూరి భారతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ ఓబులేసు ఏఐవైఎఫ్ నాయకులు లంక నాగమల్లి, సిద్దా బత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర సమితి ముద్రించిన వాల్ పోస్టర్ అంటిస్తున్న పల్నాడు జిల్లా నరసరావుపేట సీపీఐ కార్యకర్తలు



"ఏదైనా విద్య అందించని ప్రభుత్వము, ఆ దేశ ప్రజలను మోసం చేస్తున్నట్టే"

చేగువేరా

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

COMMUNIST PARTY OF INDIA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

అరుణ తారలు

కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో

అగ్రగణ్యుడు కృష్ణ పిళ్లే

జాతీయోద్యంలో సంతరించుకున్న విశేషానుభవం, పీడిత ప్రజలపై అచంచలమైన సేవాభావం కలగలిపి ఉత్తమ కమ్యూనిస్టుగా రూపొందిన కృష్ణ పిళ్లే (1906 ఆగస్టు 19-1948 ఆగస్టు 19) కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ప్రప్రథముడు. మంచి కవి కూడా. గాంధేయవాదిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. కేరళలోని అణగారిన ప్రజానీకానికి పిళ్లే ఎంతో చేరువయ్యారు. వారి హక్కుల గురించి, వారి సామాజిక, ఆర్థిక జీవన స్థితిగతులపై అవగాహన కల్పించడంలో విజయం సాధించిన గొప్ప నాయకుడు. కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఆయన తన కాబోయే భార్య థంకమ్మతో వివాహాన్ని ప్రతిపాదించిన చిన్న వాక్యాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆమెతో కృష్ణ పిళ్లే ఇలా అన్నారు: "నాతో జీవితం కష్టంగా ఉంటుంది, భిన్నంగా ఉంటుంది. నా భార్య నాకు, పార్టీ, దాని సిద్ధాంతానికి అండగా నిలబడాలి. అప్పుడే ఒంటరిగా కూడా ఆమె సంతోషంగా ఉంటుంది" అన్నారు. యువకుడిగా ఉన్నప్పుడు భారత జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా పనిచేశారు. క్రమంగా కమ్యూనిస్టు ఉద్యమం వైపు మొగ్గుతో సోషలిస్టుగా మారారు. 1934లో కాంగ్రెస్ సోషలిస్టు కార్యకర్తలు బొంబాయిలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించినప్పుడు, కృష్ణ పిళ్లే కేరళలో దాని కార్యదర్శిగా నియమితులయ్యారు, అదే సమయంలో భారత జాతీయ కాంగ్రెస్‌లో పనిచేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి, అన్యాయానికి వ్యతిరేకంగా జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమించిన పిళ్లే జీవిత చరిత్రను, పోరాట ఘట్టాలను అనిల్ వి.నాగేంద్రన్ 'వసంతతింటే కనల్ వాళికళిల్' చిత్రంతో తెరకెక్కించారు.

1906 ఆగస్టు 19న తిరువాన్కూరు సంస్థానంలోని వైకోంలో జన్మించిన కృష్ణ పిళ్లే చదివింది ఐదో తరగతి మాత్రమే. అతి పిన్న వయసులోనే తల్లిదండ్రులు మృతిచెందడంతో చదువుకు స్వస్తిపలికి జీవనం గడిచేందుకు టీకొట్టు పెట్టడం, సైకిల్ షాపులో పనిచేశారు. 1920లో ఇంటిని విడిచిపెట్టి ఉత్తర భారత్‌లో అనేక చోట్లకు వెళ్లాడు. హరిద్వార్‌లోని పరిచయస్తుల ప్రోత్సాహంతో అలహాబాద్ చేరుకుని రెండేళ్లు శ్రమించి హిందీలో సాహిత్య విశారద డిగ్రీ పొందారు. మద్రాసులోని దక్షిణభారత హిందీసభ వారి ప్రచారక్ గా కొచ్చిన్, పరిసర ప్రాంతాల్లో పనిచేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు ఉద్యోగానికి స్వస్తి చెప్పి ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని కాలికట్‌కు చేరుకోవడంతో కృష్ణ పిళ్లే రాజకీయ జీవితం మొదలైంది. యవ్వనంలోనే గాంధేయవాదిగా, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పిళ్లే క్రమంగా కమ్యూనిస్టు భావాలతో సోషలిస్టుగా మారారు. 1934లో కాలికట్ లో జరిగిన కేరళ రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రథమ మహాసభలో కృష్ణ పిళ్లే కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ హోదాలో మలబార్, తిరువాన్కూర్, కొచ్చిన్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అనేక సమస్యలపై ప్రజాందోళన కార్యక్రమాల్లో మార్గదర్శకత్వం నెరపుతూ సమన్వయపరిచారు. తర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు విశాల ప్రాతిపదిక తయారుచేసిన నిర్మాణ దీక్షాదక్షుడు కృష్ణ పిళ్లే. ఈ నిర్విరామ కృషే, మలయాళీలు మూడు భాగాలుగా విడివడి వున్న రోజుల్లోనే ఆయనకు అఖిల కేరళ నాయక ప్రతిపత్తి కలుగచేసింది. తిరువాన్కూర్ సంస్థానం దివాన్‌గా వున్న సర్. సీపీ రామస్వామి అయ్యర్ దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా కార్మికులను, కర్షకులను సమీకరించడంలో కృష్ణ పిళ్లే పాత్ర అద్వితీయం.

1934లో బొంబాయిలో జరిగిన కాంగ్రెసు మహాసభకు ప్రతినిధిగా హాజరైన కృష్ణ పిళ్లే, కె. దామోదరన్ తదితరులకు కమ్యూనిస్టు సాహిత్యం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయం ఏర్పడింది. వివిధ ప్రజాందోళనల్లో అనుభవం ఆ పరిచయాన్ని బలీయంచేసింది. 1937లో ఎస్వీవీ ఘాటే కాలికట్ పర్యటనప్పుడే కృష్ణపిళ్లే మరికొందరికి కమ్యూనిస్టు పార్టీ కేంద్రంతో సంబంధాలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ మలబార్ యూనిట్ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కేరళ శాఖగా విజయవంతంగా రూపాంతరం చెందడానికి కృష్ణ పిళ్లే అవిశ్రాంత కృషి ప్రధాన కారణం. కేరళలో 1940 జనవరి 26న అధికారికంగా సీపీఐ శాఖ ఏర్పడింది. 1948లో సీపీఐ కలకత్తా థీసిస్‌ను ఆమోదించినప్పుడు, భారత రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునివ్వడంతో దేశవ్యాప్తంగా సీపీఐ నిషేధాన్ని ఎదుర్కొంది. కృష్ణ పిళ్లే సహా అనేక మంది నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పుడు రహస్యంగా పనిచేస్తున్న రోజులలో వివిధ ప్రాంతాలను సందర్శించి శాఖలు ఏర్పాటుచేసి విస్తృతంగా పర్యటిస్తున్న కృష్ణ పిళ్లేని ఆయన స్వగ్రామంలో అరెస్టు చేసి కన్యాకుమారి జిల్లాలోని ఎడ్లకొడి సబ్ జైలులో నిర్బంధించారు. ఇక్కడే తన జీవిత భాగస్వామి థంకమ్మతో పిళ్లేకి విచిత్రంగా పరిచయం కలిగింది. వివిధ సమస్యలపై బయటి కామ్రేడ్లకు సుదీర్ఘమైన లేఖలు హిందీలో రాసి హిందీ అభ్యసిస్తున్న థంకమ్మకు చేరవేస్తే వాటిని మలయాళంలోకి అనువదించి పిళ్లే సహచరులకు అందచేయడం ఆమె పని. ఈ పరిచయం ప్రణయంగామారి 1942లో పిళ్లే జైలు నుంచి విడుదలైన తర్వాత వివాహం జరిగింది. అదే సంవత్సరం సెప్టెంబరులో బొంబాయిలో జరిగిన పార్టీ సెంట్రల్ ప్లీనంకు హాజరై వచ్చిన తర్వాత కృష్ణ పిళ్లే నిషేధం తొలగింపువల్ల ఏర్పడిన అవకాశాలతోపాటు, నిర్మాణం, పలుకుబడి పార్టీ అభివృద్ధికి వినియోగించుకోడంలో నిర్విరామకృషి జరిపారు. 1943లో కాలికట్‌లో జరిగిన అఖిల కేరళ కమ్యూనిస్టు పార్టీ ప్రథమ మహాసభలో కృష్ణ పిళ్లే కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పటినుండి 1948లో మరణించేవరకు ఆ పదవిలో కొనసాగారు. 1948ఆగస్టు 19వ తేదీ ఉదయం అల్వే సమీపంలోని కన్నారట్ గ్రామంలో ఒక పార్టీ సభ్యుని ఇంట రాష్ట్ర కమిటీ సమావేశానికి రిపోర్టు రాస్తుండగా తాచుపాము కరవడంతో ప్రాణాలు కోల్పోవడం విషాదకరం.

-మోదుమూడి మురళీకృష్ణ

కమ్యూనిస్టు యోధ వంక

వంక సత్యనారాయణ

కమ్యూనిస్టు యోధుడు, 'అసెంబ్లీ టైగర్'గా గుర్తింపు పొందిన వంక సత్యనారాయణ. విద్యార్థి దశనుంచే స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యానంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నిరంతరం పోరాటాలు నిర్వహించారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, కర్షకుల ఉన్నతికి విరామ మెరుగని పోరాటాలు చేశారు. సిపిఐపై నిషేధ కాలంలో సైతం పోలీసు నిర్బంధాలు, అరెస్టులను లెక్క చేయక కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అంకిత భావంతో పనిచేశారు. కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, అసెంబ్లీ టైగర్ గా గుర్తింపుపొందిన వంక సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ సమీపంలోని పేకేరు గ్రామంలో 1924 అక్టోబరు 1న వెంకట రామదాసు, భద్రమ్మ దంపతులకు వంక జన్మించారు. ఎలిమెంటరీ విద్య పెనుగొండలో, హైస్కూల్ విద్య తణుకులో అభ్యసించారు. 1939లో ఫిఫ్త్ ఫారం చదువుకుంటున్న సందర్భంలో పెనుగొండ మిడిల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు యర్రమిల్లి కామేశ్వరరావు దేశభక్తి యుత బోధనలు వంక స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ప్రేరణతో తణుకులో హైస్కూల్ విద్య అభ్యసిస్తున్న సమయంలో స్వతంత్ర భారతి పత్రిక అధ్యయనంతో దేశ స్వాతంత్ర్యం, సోషలిజం నిర్మాణ సాధనే ధ్యేయంగా వంక తన జీవితాయాన్ని నిర్దేశించుకున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఉధృతంగా పాల్గొన్న వంక అనేకసార్లు అరెస్టయి జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే పార్టీ నిషేధ కాలంలో సైతం వంక సత్యనారాయణ విద్యార్థిగా తన బాల్యదశ నుంచే ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

పరకాల పట్టాభి రామారావు, భూపతిరాజు సుబ్బరాజుతో కలిసి తణుకులో అఖిల భారత విద్యార్థి సమాఖ్య నిర్మాణానికి పూనుకున్నారు. స్వాతంత్ర్య పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచారు. అనేక పోరాటాలు, సమ్మెలు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రిటిష్ వ్యతిరేక స్వతంత్ర భారత్ పత్రిక వంక జీవితపథాన్నే పూర్తిగా మార్చేసింది. రెగ్యులర్‌గా ఆ పత్రిక చదవడంతో జాతీయోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం వైపుకు వంకను నడిపించింది. 1942లో వంక కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొంటూనే ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు సంకు అప్పారావు, ఎం.వీ.ఎన్.కపర్ది, మారెళ్ళ నరసింహారావు, పరకాల శేషావతారం, భూపతిరాజు, సుబ్బరాజు తదితర నాయకులతో కలిసి పశ్చిమ గోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పునాదులు వేశారు. పోలీసుల నిర్బంధాలు, అరెస్టులు లెక్క చేయకుండా మొక్కవోని దీక్షతో పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ నిషేధ సమయంలో సైతం ఉద్యమ నిర్మాణానికి ఎంతో ధైర్య సాహసాలతో అంకితభావంతో పని చేశారు.

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పోలీసుల దమనకాండ నిరసిస్తూ చేపట్టిన ఉద్యమంలో యండగండి వద్ద వంకతో పాటు పరకాల రమణారావు, భూపతిరాజు సుబ్బరాజు, పాకెర్ల సంజీవరావు, పేరిచర్ల చినసోమరాజు, పరకాల శేషావతారం, నందూరి రామారావు లను దేశ రక్షణ చట్టం కింద అరెస్టు చేసి ఆలీపూర్ క్యాంపు జైలుకు ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష వేసి పంపారు. క్విట్ ఇండియా వజ్రోత్సవ వేడుకలు సందర్భంగా 2018 ఆగస్టు 9న ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌చే గౌరవ పురస్కారాన్ని పొందారు.

పెనుగొండ నియోజకవర్గం నుంచి 1962,1972,1994 లో సీపీఐ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ వేదికగా వంక తన అనర్గళమైన వాగ్ధాటి తో ప్రజా సమస్యలపై విరుచుకు పడేవారు. పలు నిర్మాణాత్మక సూచనలు చేసేవారు. వాదప్రతివాదనలతో అధికార పక్షానికి ముచ్చెమటలు పట్టిస్తూ అసెంబ్లీ టైగర్‌గా పిలువబడ్డారు. పుచ్చలపల్లి సుందరయ్య,పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, సివికె రావు, తరిమెల నాగిరెడ్డి, వేములపల్లి శ్రీకృష్ణ, తెన్నేటి విశ్వనాథం,ఈశ్వరీభాయి, వావిలాల గోపాలకృష్ణయ్య వంటి హేమాహేమీలతో వంక శాసనసభ్యునిగా పనిచేశారు. 1970వ దశకంలో సోషలిస్టు నాయకుడు మధులిమయే ఏవిధంగా పార్లమెంటులో తన గళాన్ని వినిపించేవారో సరిగ్గా అదే రీతిలో అసెంబ్లీ వేదికగా సీపీఐ పక్షాన వంక తన వాణి వినిపించడంతో మధులిమయే ఆఫ్ ఏపీగా ఆయనను అభివర్ణించేవారు. ఆ రోజుల్లో ఆలిండియా రేడియో అసెంబ్లీ సమావేశాల సమీక్షకు పది నిమిషాలు సమయం కేటాయిస్తే అందులో ఎనిమిది నిముషాలు వంక ప్రస్తావించిన అంశాల ప్రస్తావనే వుండేది. ఆనాటి ముఖ్య మంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి,జలగం వెంగళరావు లాంటి ఉద్దండులైన కాంగ్రెస్ నేతలు వంక మాటకు విలువిచ్చేవారు. ఆయన సహచరులే కాకుండా ప్రత్యర్థులు సైతం వంకను అసెంబ్లీ టైగర్ గా పిలిచేవారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మూడు సార్లు బాధ్యతలు చేపట్టిన వంక రాష్ట్ర వ్యాపిత భూపోరాటాలకు శ్రీకారం చుట్టారు. భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు,గుజ్జుల యలమందారెడ్డి,నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణరావు లాంటి ఉద్దండులతో కలిసి భూపోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయించి భూపోరాట యోధుడుగా నిలిచారు. 1942లో సీపీఐ సభ్యునిగా చేరిన వంక పార్టీ జాతీయ సమితి సభ్యుని స్థాయికి ఎదిగారు. 2018 అక్టోబరు 25 న తుదిశ్వాస వీడే వరకు పార్టీని వీడలేదు.

- కోనాల భీమారావు

జవం జీవం పార్టీ, పేదలే

జల్లి విల్సన్

నా పుట్టుకే కమ్యూనిస్టు....నాకంటూ వేరే వ్యాపకం ఏనాడూ లేదు...జవం జీవం అన్నీ పార్టీ, పేదలే. సర్వదా వ్యక్తిగత ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలే మిన్నగా ఎంచి కృషి చేయాలని పార్టీ సభ్యత్వం తీసుకున్ననాడే చేసిన ప్రతినను నేటికీ తూ.చ. తప్పకుండా పాటిస్తూనే ఉన్నాను. మా తండ్రి జల్లి ఏసేబు, తల్లి కాంతమ్మ. కృష్ణాజిల్లా వీరులపాడు మండలంలోని జుజ్జూరు గ్రామంలో 1951 ఏప్రిల్ 15న జన్మించాను. తాత, తండ్రి కమ్యూనిస్టులు కావడంతో స్వతహాగానే నేను కూడా అదే బాటలో నడిచాను. పీడిత ప్రజల అభ్యున్నతి కోసం అహోరాత్రులు శ్రమించిన పార్టీ హోల్‌టైమర్‌గా, ఒకానొక సమయంలో అజ్ఞాతవాసం సైతం గడిపిన మా నాన్న జీవితమే నాకు స్ఫూర్తి. ఆనాటి సర్కారు దమనకాండకు మా తాత, తండ్రి, చిన్నాన్న అందరూ గురయ్యారు. ప్రాథమికవిద్య జుజ్జూరులో, తొలి మూడు ఫారాలు మధిరలో, నాల్గవ ఫారం నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు కంచికచర్లలో చదివిన నేను పీయూసీ విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో పూర్తిచేశాను. పదేళ్ల వయసులో 1961లో విజయవాడలో సీపీఐ 6వ మహాసభలు జరిగిన సందర్భంలో గ్రామప్రజలతో సభల ప్రాంగణ సెట్టింగులు చూసి పిల్లలంగా కేరింతలు కొట్టేవాళ్లం. కాలేజీలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తగా క్రియాశీలంగా పనిచేసిన రోజుల్లో 'డిగ్రీవరకు విద్యాబోధన మాతృభాష తెలుగులోనే చేయాల'న్న డిమాండ్‌తో సాగించిన ఉద్యమానికి నాయకత్వం వహించడం జరిగింది. ప్రస్తుతం అది అమలులో ఉండటం ఆనాటి ఏఐఎస్ఎఫ్, ఐక్య ఉద్యమ ఫలితమే. ఆకలి చావులకు విరుగుడుగా పనులు కల్పించాలని 1 రూపాయికే బియ్యం సరఫరా చేయాలని జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి సూర్యదేవర నాగేశ్వరరావు నాయకత్వాన జిల్లా సంఘ సహాయ కార్యదర్శిగా నేను 15 రోజులపాటు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పాదయాత్ర చేశాం. 1966 విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నాను. 1968లో ఏలూరులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ప్రదర్శనకు, బహిరంగసభకు ఏఐఎస్ఎఫ్ వెల్‌ఫేర్ హాస్టల్ ద్వారా హాజరై నేతల ప్రసంగాల నుంచి గొప్ప స్ఫూర్తిని పొందాం. 1969లో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) దేశవ్యాప్తంగా భూపోరాటాలకు పిలుపునివ్వడంతో మా స్వగ్రామంతోపాటు పరిసర ప్రాంతంలో ఆనుకొని ఉన్న వేముకుంట అటవీ బంజరు భూపోరాటంలో పాల్గొన్నాం. నాన్నగారి ఆధ్వర్యంలో మా ఊరిలో భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటం చేసి వందలాది ఎకరాలు పేదలకు పంచేవిధంగా కృషి చేశాం. ఈ సందర్భంలోనే వందమందితోపాటు నేను కూడా నందిగామలో 15 రోజులు జైలులో గడపాల్సివచ్చింది. 21 ఏళ్లు నిండిన తర్వాత 1971లో అధికారికంగా పార్టీ సభ్యత్వం ఇచ్చారు. 1972 డిసెంబరు 24న ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి వ్యతిరేకంగా రాష్ట్ర సమైక్యత కోసం పార్టీ సాగించిన వీరోచిత పోరులో నేను కూడా భాగస్వామినే. ఈ క్రమంలోనే విజయవాడలో కర్రదెబ్బలు, రాళ్లదెబ్బలు తిన్నాం. మా నాన్నకు, తాలూకా పార్టీ కార్యదర్శి ఆచారికి బలమైన గాయాలయ్యాయి. రౌడీమూకల నుండి విశాలాంధ్ర పత్రిక కార్యాలయాన్ని పరిరక్షించేందుకు పది రోజులపాటు అక్కడే మకాం వేశాం.

1970 నుంచి మూడేళ్లపాటు గ్రామంలో బిల్‌కలెక్టర్‌గా ఉద్యోగం చేశాను. ఆ ఉద్యోగం పర్మినెంట్ అవుతున్న దశలో కృష్ణాజిల్లా కార్యదర్శి మాలెంపాటి బాలభాస్కరరావుగారు నన్ను తీసుకుపోయి, ఆఫీసు కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. 1973 ఏప్రిల్ 22న విజయవాడ పీడబ్ల్యుడీ గ్రౌండ్స్‌లో జరిగిన సమైక్యాంధ్ర విజయోత్సవ సభలో ఉత్సాహంగా పాల్గొన్నాను. ఆ తర్వాత 1974లో నాకు అత్యంత ఇష్టమైన బీకేఎంయూ 3వ జాతీయ మహాసభ తెనాలిలో ప్రతినిధిగా హాజరయ్యాను. యల్లమందారెడ్డి, కోండ్రు సుబ్బారావు, చండ్ర రాజేశ్వరరావు, స్వర్ణ వేమయ్య వంటి అగ్రనాయకత్వం నన్ను ఉత్తేజితుడ్ని చేసింది. ఆనాటి నుంచి అన్ని బీకేఎంయూ మహాసభలకూ హాజరై, తండ్రివారసత్వంతో అటు పార్టీలోనూ, ఇటు వ్యవసాయకార్మిక సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాను. 1974లో వినయరాణితో నాకు వివాహమైంది.

అనుబంధం

కాంగ్రెస్ కుటుంబానికి చెందిన ఆమె నా ఉద్యమ స్వభావానికి ఏనాడూ అడ్డుకాలేదు. పూర్తి భాగస్వామి అయింది. 1975లో విజయవాడలో జరిగిన సీపీఐ 10వ మహాసభల్లో ఫుడ్ కమిటీ కన్వీనర్‌గా ఆంజనేయశాస్త్రి ఉండటం వల్ల శిష్యునిగా నేను ఆయనకు చేదోడువాదోడుగా పూర్తిస్థాయిలో పనిచేశాను. 1979లో దళితులపై జనతా ప్రభుత్వం సాగించిన దాడులకు వ్యతిరేకంగా, భూసమస్య, కూలిరేట్ల పెంపుదల, సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టం కోసం బీకేఎంయూ ఆధ్వర్యంలో గోవిందన్‌యర్ ప్రచారయాత్రలోనూ, ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన మహాప్రదర్శన, సభల్లో పాల్గొన్నాను. మైలవరం ప్రాంతంలోని కనిమెర్లలో జరిగిన భూపోరాటంలో కొల్లి నాగేశ్వరరావు, సీహెచ్.కోటేశ్వరరావులతో పాటు పాల్గొన్నాను. అక్కడ జరిగిన భూపోరాటంలో కోటేశ్వరరావుకు, పేదప్రజలకు అండగా వున్నాను. నేడు వేలాది ఎకరాలు 15 గ్రామాల్లోని పేదలు ఫలితం అనుభవిస్తున్నారు. హైదరాబాద్‌లో 1982లో 40 రోజులపాటు రాష్ట్రస్థాయి రాజకీయ పాఠశాలకు హాజరయ్యాను. 1995 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నా నివాసప్రాంతమైన మొగల్రాజపురం 39వ డివిజన్‌లో సీపీఐ తరపున కార్పొరేటర్‌గా పోటీచేసి విజయం సాధించాను. మేయర్ టీవీ గారి నాయకత్వాన ఆయన శిక్షణలో మూడేళ్లపాటు సభానాయకునిగా కూడా ప్రజారంజ కంగా విధులు నిర్వర్తించాను. నేటికీ ఆ ప్రాంత ప్రజలు నా పట్ల చూపిస్తున్న అభిమానమే అందుకు నిదర్శనం. నా నిబద్ధత గుర్తించిన సురవరం సుధాకరరెడ్డి గారు నాకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించారు. గుండా మల్లేష్ ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. నిర్వీర్యమైన వ్యవసాయ కార్మిక సంఘానికి 2006 కూలిదండు మరోమహాయాత్రతో పూర్వవైభవం తీసుకురావడం జరిగింది. ఈ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో భూపోరాటాలు, సామాజిక, ఆర్థిక సమస్యలపై సాగించిన ఉద్యమాలు తనను రాష్ట్ర నాయకునిగా గుర్తింపు తీసుకువచ్చాయి.

1988లో కృష్ణాజిల్లా నుండి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్‌కు ఎన్నికైన నన్ను 2003లో కార్యవర్గంలోకి తీసుకున్నారు. 2007లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎం.ఎల్.సిగా పార్టీ ఎంపికచేసింది. ఆరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగాను. అందులో రెండేళ్లు ఫ్లోర్‌లీడర్‌గా కూడా పనిచేశాను. లాటరీలో ఆరేళ్లు రావడంతో ఆనాడు డాక్టర్ కె.నారాయణ 'లాటరీకి కూడా సామాజిక న్యాయం తెలుసు' అని ఛమత్కరించారు. ఎమ్మెల్సీగా సభ అంచనాల కమిటీ, సాంఘిక సంక్షేమ, విద్యా కమిటీల్లో సభ్యునిగా సేవలందించాను. బడుగు జీవుల సమస్యలపై, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనేక సమస్యలను సభలో లేవనెత్తాను. నా నిధులన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, పట్టణాల అభివృద్ధికి కేటాయించాను. ఆ రకంగా మంచి గుర్తింపు దక్కింది. 2007లోనే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గంలో చోటు కల్పించబడింది. ప్రతి సందర్భంలోనూ పార్టీ చేసిన ప్రతి ఒక్క తీర్మానాలకు, నిర్ణయాలకు కట్టుబడి, నిబద్ధతతో క్రమశిక్షణగా పనిచేశాను.

ఆంజనేయశాస్త్రి, దోనేపూడి దత్తు, దాసరి నాగభూషణరావు, సురవరం సుధాకరరెడ్డి వంటి వారి శిక్షణలో ఎదిగాను. త్యాగజీవి నా తండ్రిని అన్యాయంగా పార్టీ నుండి గెంటివేసినా నేను పార్టీలోనే కొనసాగాను. ఇది పెద్ద అనుభవం. రాష్ట్ర విభజన తర్వాత కూడా పార్టీలో నేటికీ కీలక భూమిక వహిస్తూనే వున్నాను. ప్రస్తుతం విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఉడతాభక్తిగా నేను కూడా సహాయం చేసిన, ప్రతిష్ఠాకరమైన హైదరాబాద్‌లోని చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌కు ఉపాధ్యక్షునిగా వున్నాను. విజయవాడలో జరగబోతున్న సీపీఐ 24వ మహాసభలు మాకెంతో ప్రతిష్ఠాత్మకమై నవి. ఆహ్వానసంఘం కోశాధికారిగా, సభల నిర్వహణలో ఇతర బాధ్యతల్లోనూ క్రియాశీలంగా ఉన్నాను.

మా అబ్బాయి హైదరాబాద్‌లోనూ, మా అమ్మాయి విజయవాడలోనూ ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. నా భార్య చనిపోవడంతో మా అమ్మాయి వద్దనే వుంటున్నాను.

ఎల్డీఎఫ్ కోసం సీఎం పదవిని వదులుకున్న పీకేవీ



చట్ట సభల మేటి

భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పీకే వాసుదేవన్ నాయర్ (1926 మార్చి2-2005జులై 12) పీకేవీగా చిరపరిచితుడు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. వామపక్ష ఐక్యత కోసం పరితపించారు. పదవి చేపట్టి ఏడాది కాలమే అయినా ముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా వదిలిపెట్టారు. 1977, 1980లో రెండు సార్లు ఆయన కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1957, 1962, 1967, 2004లో మొత్తం నాలుగు సార్లు కేరళ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. లోక్‌సభలో సీపీఐ పక్ష నాయకునిగా వ్యవహరించారు. ఏకే ఆంటోని రాజీనామా చేయడంతో 1978 అక్టోబరు 20న కేరళ ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణస్వీకారం చేశారు. దేశంలో వామపక్ష ఐక్యత శకానికి నాంది పలికిన నేపథ్యంలో కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ఏర్పాటు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)తో పొత్తుసకు ఏడాది పదవిలో ఉన్న తర్వాత అంటే 1979 అక్టోబరు7న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. 1982 నుంచి 2004 వరకు ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్న పీకేవీ పార్టీ నిర్మాణం కోసం తన సమయాన్ని, శక్తిని వినియోగించారు. అధికారంలో ఉన్నా లేకున్నా, ఆయన ఎప్పుడూ సాదాసీదా జీవితాన్ని గడిపేవారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిరాడంబరమైన కమ్యూనిస్టు, సరళతకు ప్రతిరూపం వాసుదేవన్ నాయర్. ప్రజల సమస్యల కోసం పోరాడిన ఆయన ప్రజల మదిలో సుస్పష్టమైన ముద్ర వేశారు. సెంట్రల్ కేరళ కొట్టాయం జిల్లాలోని కిడంగూర్ గ్రామంలో 1926 మార్చి2న పీకేవీ జన్మించారు. ఆయన తండ్రి కేశవ పిళ్లే, తల్లి నానికుట్టి అమ్మ. అలువాలోని యూనియన్ క్రిస్టియన్ కాలేజీలో చదువుతున్నప్పుడు విద్యార్థి కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు, భౌతికశాస్త్రంలో పట్టభద్రుడయ్యాక తిరువనంతపురంలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1945లో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిన పీకేవీ కాంగ్రెస్ పార్టీని మితవాద, ధనికుల అనుకూలమైనదిగా భావించేవారు. పీకేవీ ట్రావెన్కూర్ స్టూడెంట్స్ యూనియన్, ఆల్ కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ , అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షునిగా, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ డెమోక్రటిక్ యూత్ (డబ్ల్యూఎఫ్డీవై) ఉపాధ్యక్షునిగా పనిచేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు పీకే వాసుదేవన్ నాయర్, బల్‌రాజ్ సహాని మద్దతు ఇచ్చారు. ఢిల్లీలోని ఫైర్‌బ్రాండ్ యువ నాయకుడు గురు రాధాకిషన్ ఢిల్లీలో ఏఐవైఎఫ్ మొదటి జాతీయ సదస్సును నిర్వహించడంలో చాలా చురుగ్గా పనిచేశారు, ఈ సమావేశానికి దేశం వివిధ ప్రాంతాల నుంచి 250 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 1964 లో కమ్యూనిస్టు ఉద్యమం చీలిక తర్వాత పీకేవీ సీపీఐలో కొనసాగారు. సుదీర్ఘ పార్లమెంటరీ కెరీర్ నుంచి 1970లో రాష్ట్ర రాజకీయాలకు తిరిగి వచ్చారు ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికలలో 1977లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన 1982లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడుగా, కార్యదర్శివర్గ సభ్యుడిగా పనిచేశారు. పీకేవీ 1954-57 మధ్య పార్టీ పత్రిక 'జనయుగం' దినపత్రిక సంపాదకుడిగా కూడా పనిచేశారు. వాసుదేవన్ నాయర్ హృద్రోగం, తీవ్రమైన మధుమేహం కారణంగా బహుళ అవయవ వైఫల్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 2005 జులై 12న తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య, ప్రముఖ మార్క్సిస్టు మేధావి, పీకేవీ సహవిద్యార్థి అయిన పి. గోవింద పిళ్లేకి చెల్లెలు అయిన లక్ష్మీకుట్టి అమ్మ, పీకేవీ మృతిచెందిన ఎనిమిది సంవత్సరాల తరువాత 2013 జులై 6న ఆమె మరణించారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

- ఎం. లక్ష్మీరాజ్యం

ఉద్యమ గళమై... ఊరూరా దళమై

- అమరావతిని రక్షించుకుందాం
- పశ్చిమ గోదావరిలో సాగుతున్న మహా పాదయాత్ర
- తణుకులో స్వల్ప ఉద్రిక్తత

విశాలాంధ్ర-తణుకు: 'అమరావతిని పరిరక్షించుకుందాం', 'ఒకే రాష్ట్రం ఒకే రాజధాని', 'జై అమరావతి' నినాదాలతో అమరావతి పరిరక్షణ సమితి అధ్వర్యంలో రైతుల మహాపాదయాత్ర31వ రోజు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలో కొనసాగింది. తణుకు నియోజకవర్గం వేల్పూరు నుంచి వీరభద్రపురం, మండపాక భోజన విరామ అనంతరం తణుకు చేరుకుంది. పట్టణంలో ఆర్ఓబీ, వెంకటేశ్వర థియేటర్, నరేంద్ర సెంటర్, కేశవ స్వామి గుడి సెంటర్, ఉండ్రాజవరం జంక్షన్, ఉండ్రాజవరం రోడ్డులోని పాలంగి వరకు జరిగింది.

మధ్యలో ఉద్రిక్తత

అయితే పాదయాత్ర నరేంద్ర కూడలికి చేరుకున్న తరుణంలో వైసీపీ నేతలు పాదయాత్రను అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. రైతుల పాదయాత్రకు వ్యతిరేకంగా మూడు రాజధానుల పేరులో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతటితో ఆగకుండా సభ ఏర్పాటు చేసి, నిరసన తెలుపుతూ గాల్లోకి బెలూన్లు ఎగురవేశారు. జై జగన్... అమరావతి వద్దు, మూడు రాజధానులు ముద్దు అంటూ వైసీపీ శ్రేణులు రోడ్డుకు ఒకవైపు నిల్చుని నినాదాలు చేశారు. అమరావతి రైతులను రెచ్చగొట్టేలా మహిళలు నినాదాలు చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు రక్షణ వలయంగా ఏర్పడి రోప్ సహాయంతో వైసీపీ శ్రేణులను నిలువరించారు. నిరసనల మధ్యే పాదయాత్ర ఉండ్రాజవరంవైపు సాగింది. ఒకదశలో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో అమరావతి మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, మద్దతుదారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం కానూరులోని కల్యాణ మండపంలో రాత్రి బస చేశారు. బుధవారంతో పశ్చిమగోదావరి జిల్లాలో రైతుల మహా పాదయాత్ర ముగిసింది. దారి పొడవునా వందలాది మంది రైతులు, స్థానికులు అమరావతి రైతులతో కలిసి అడుగులో అడుగు వేశారు. రైతుల పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. అమరావతి ప్రాధాన్యతను వివరిస్తూ జేఏసీ నాయకులు కరపత్రాలు పంచారు. స్థానిక మహిళలు పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. స్థానికులు రోడ్లు పక్కన టెంట్లు వేసి రాజధాని రైతులకు పండ్లు, అల్పాహారం అందించారు. ఈ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆయన సతీమణి తులసి, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జనసేన తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విడివాడ రామచంద్రరావు, టీడీపీ నాయకులు పరిమి వెంకన్న బాబు, కలగర వెంకటకృష్ణ, చుక్కా సాయిబాబు, చిట్టూరి స్వర్ణలత, అనేక పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ సంఘీభావం

అమరావతి నుంచి అరసవల్లికి రైతులు తలపెట్టిన మహా పాదయాత్ర తణుకు నియోజకవర్గ వేల్పూరు వద్ద సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మద్దతు తెలిపి పాదయాత్రలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమారావు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహానిధులు, విశాఖకు రైల్వేజోన్ లాంటి రాష్ట్ర విభజన హామీలు సాధించడానికి రాజీనామా చేయాలన్నారు. అమరావతి పరిరక్షణకు చిత్తశుద్ధితో రైతులు చేస్తున్న మహా పాదయాత్రకు అడ్డంకులు సృష్టించాలనుకోవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మొద్దు నిద్ర వీడి అమరావతిని రాజధానిగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు టీ అప్పలస్వామి, నాయకులు, కార్యకర్తలు, వై నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాకారుల ధూం ధాం సాంస్కృతిక సందడి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నేతలు చంద్రానాయక్, పెంచలయ్య

విశాలాంధ్ర-విజయవాడ: ఈనెల 14 నుంచి 18 వరకు విజయవాడలో జరిగే సీపీఐ జాతీయ 24వ మహాసభల సందర్భంగా గురువారం నుంచి కళాకారుల ధూం ధాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో ఐదు రోజుల పాటు సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 13వ తేదీన జరిగే ఆట-పాట-మాట కళాకారుల ధూం ధాం కార్యక్రమానికి ప్రారంభకులుగా ప్రముఖ ప్రజాకవి, వాగ్గేయ కారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, ప్రముఖ అభ్యుదయ కళాకారులు గిద్దే రాంనరసయ్య, రెంజర్ల రాజేశ్, పల్లె నరసింహా, పాటల తూట ఉదయ్ భాస్కర్, అమరావతి సాంస్కృతిక ఉద్యమ కళాకారుడు పి.రమణ, రంగం రాజేశ్, నూకతోటి శరత్, సత్య, చైతన్య, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులుచే ధూం ధాం కార్యక్రమం ఉంటుందన్నారు. 14వ తేదీన అజిత్ సింగ్‌నగర్ స్టేడియంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందే మాతరం శ్రీనివాస్ బృందంతో ఎర్రజెండా పాటలు, చిన్నారులచే దేశ భక్తి గీతాలకు నృత్య ప్రదర్శన జరుగుతుందని వివరించారు. 15వ తేదీన ఆర్.రామకృష్ణ అధ్యక్షతన జరిగే సభకు ప్రారంభకులుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి చీఫ్ ప్యాట్రన్ నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ముఖ్య అతిథులుగా సినీ నిర్మాత మాదాల రవి, ధవళ సత్యం, జి.ఈశ్వరయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, అభ్యుదయ జానపద పాటల ప్రజా గాయకులు మానుకోట ప్రసాద్ పాల్గొంటారని, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ జగ్గారాజు బృందంచే సంఘం-శరణం-గచ్ఛామి అంబేద్కర్ నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే తిరుపతి ప్రజానాట్యమండలి, విజయవాడ నగర ప్రజానాట్యమండలి వారిచే అభ్యుదయ గేయాలు, నృత్య ప్రదర్శన జరుగుతాయని పేర్కొన్నారు. 16వ తేదీన ఆర్.పిచ్చయ్య అధ్యక్షతన జరిగే సభకు ప్రారంభకులుగా సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ముఖ్య అతిథులుగా సినీ నటులు అజయ్ ఘోష్, మాటల రచయిత, నటుడు సంజీవి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ పాల్గొంటారని, ప్రకాశం జిల్లా ప్రజానాట్యమండలి వారిచే రాజకీయ భాగోతం నృత్య గేయ నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే ప్రకాశం, కర్నూలు జిల్లాల చిన్నారులచే పాటలకు నృత్య ప్రదర్శన జరుగుతుందని అన్నారు. 17వ తేదీన ఎస్కే నజీర్ అధ్యక్షతన జరిగే సభకు ప్రారంభకులుగా సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, ముఖ్య అతిథులుగా సినీ గేయ రచయిత చైతన్య ప్రసాద్, సినీ డైరెక్టర్ బాబ్జీ, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, టీవీ ఆర్టిస్టు అల్లం గోపాలరావు పాల్గొంటారు. తెలంగాణ ప్రజానాట్య మండలి వారిచే వీర తెలంగాణ ఒగ్గు కథ, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వల్లూరి శివప్రసాద్, గంగోత్రి సాయి దర్శకత్వంలో 'ఓ హోం ఓ హోం' నాటికను ప్రదర్శిస్తారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో ఎస్.గురప్ప, మహంత్ లక్ష్మణరావు, ఆరెటి రామారావు, చంద్రశేఖర్, మారెళ్ల శ్రీనివాసులు, వి.నాగరాజు, ఎ.శివయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారు. సీపీఐ జాతీయ మహాసభలలో పాల్గొంటున్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, విజయవాడ నగర ప్రజలు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

'ఈడబ్ల్యూ' ర్యాంకుల్లో దిల్లీ టాప్

న్యూదిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణలతో ముందుకెళ్తూ.. ఉత్తమ విద్యను అందిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలోని దిల్లీ ప్రభుత్వం చెబుతోంది. దీంతో దిల్లీ ఎడ్యుకేషన్ మోడల్‌పై అనేక రాష్ట్రాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎడ్యుకేషన్ వరల్డ్ పోర్టల్ విడుదల చేసిన దేశవ్యాప్త ఉత్తమ పాఠశాలల జాబితాలో (రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విభాగం) దిల్లీకి చెందిన రెండు ప్రభుత్వ పాఠశాలలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా టాప్-10లో దిల్లీకి చెందిన ప్రభుత్వ పాఠశాలలే ఐదు ఉండడం గమనార్హం. ద్వారకా సెక్టార్-10లోని రాజ్‌కీయ ప్రతిభా వికాస్ విద్యాలయ తొలి స్థానంలో నిలవగా, యమునా విహార్‌లోని రాజ్‌కీయ ప్రతిభా వికాస్ విద్యాలయ రెండోస్థానంలో నిలిచాయి. దిల్లీ ద్వారకాలోని ఈ పాఠశాల గతేడాది కూడా తొలిస్థానంలో నిలిచింది. దీనిపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో దేశంలోనే ఉత్తమ ర్యాంకులు సాధించడం గర్వకారణమంటూ పాఠశాలల జాబితాను ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల ర్యాంకింగ్‌లో తెలుగు రాష్ట్రాల స్కూళ్లు చోటు సాధించలేకపోయాయి. అయితే, ప్రభుత్వ రెసిడెన్షియల్ విభాగంలో మాత్రం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని జవహార్ నవోదయ 13వ ర్యాంకు, కరీంనగర్ జేఎన్వీ 21వ స్థానంలో నిలిచాయి.

పిల్లల్ని పాఠశాలకు పంపుతున్నారా?

- సంక్షేమ పథకాలు అందుతున్నాయా?
- త్రిపురలో తేయాకు కార్మికులను పలుకరించిన రాష్ట్రపతి ముర్ము

బముటియా: 'మీ పిల్లల్ని పాఠశాలలకు పంపిస్తున్నారా? మీకు ఉచిత బియ్యం, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?' అని అష్టమి ముండా అనే మహిళను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. బుధవారం రాష్ట్రపతి ఈశాన్య రాష్ట్రం త్రిపురలో పర్యటించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం అగర్తలా విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ సత్యనారాయణ్ ఆర్య, సీఎం మాణిక్ సాహా, కేంద్ర సహాయ మంత్రి ప్రతిమ భౌమిక్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా నర్సింగర్ చేరుకున్న రాష్ట్రపతి ముర్ము, హైకోర్టు సీజే జస్టిస్ ఇంద్రజిత్ మహంతితో కలిసి జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె దుర్గాబారి తేయాకు ఎస్టేట్‌ను సందర్శించారు. అక్కడి తేయాకు కార్మికులతో కాసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్రపతి అనేక ప్రశ్నలు అడిగారు. ఈ పర్యటనలో తన వెంట ఉన్న సీఎం మాణిక్ సాహా, స్థానిక ఎమ్మెల్యే కృష్ణధాన్ దాస్‌లను గుర్తుపట్టగలరా? అని కార్మికుల్ని అడగ్గా.. వారంతా తెలుసు అన్నట్టుగా స్పందించారు. "వీళ్లు ఇక్కడివారే.. మీకు ఏ సమస్య ఉన్నా వారిని సంప్రదించండి" అని తేయాకు కార్మికులకు రాష్ట్రపతి సూచించారు.

అంతకుముందు విమానాశ్రయంలో రాష్ట్రపతి త్రిపుర స్టేట్ రైఫిల్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తేయాకు కార్మికులతో రాష్ట్రపతి మాట్లాడిన అనంతరం ఎమ్మెల్యే దాస్ మీడియాతో మాట్లాడారు. తొలిసారి ఒక రాష్ట్రపతి తమ తేయాకు ఎస్టేట్‌ను సందర్శించారని.. ఎంతో గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రపతి రాక సందర్భంగా తేయాకు గార్డెన్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

దాదాకు 'షా' వెన్నుపోటు

- ఐపీఎల్ చైర్మన్ ఇస్తామన్న బోర్డు
- సున్నితంగా తిరస్కరించిన గంగూలీ
- ఐసీసీ చైర్మన్ రేసులోనూ లేనట్టే
- చక్రం తిప్పిన జైషా?

న్యూదిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ శకం ముగిసింది. బోర్డు అధ్యక్షుడిగా మరో దఫా కొనసాగేందుకు పెద్దలు ఒప్పుకోలేదు. ఐపీఎల్ చైర్మన్ పదవి తీసుకోవాలని అవమానకరంగా మాట్లాడారు. బీసీసీఐ ప్రెసిడెంట్‌గా చేసి ఐపీఎల్ చైర్మన్ వంటి చిన్న పదవులు చేపట్టడం తన స్థాయికి తగదని ఆ ఆఫర్‌ను దాదా తిరస్కరించాడు. దాంతో ఏ పదవికీ దాదా నామినేషన్ దాఖలు చేయలేదు. ఈనెల 18న బీసీసీఐ ఎన్నికలు జరగనుండగా.. అన్ని పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఏ పదవికి పోటీలేకుండా చర్చించి నామినేషన్స్ దాఖలు చేశారు.

బిన్నీనే తదుపరి అధ్యక్షుడు

1983 ప్రపంచకప్ విన్నర్ రోజర్ బిన్నీ బీసీసీఐ ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ దాఖలు చేయగా.. ఉపాధ్యక్ష పదవికి రాజీవ్ శుక్లా పోటీపడుతున్నాడు. అధ్యక్ష పదవికి బిన్నీ నామినేషన్ దాఖలు చేశాడని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. బిన్నీతో పాటు జై షా, ఆశిష్ షెలార్, దేవజిత్ సైకియా నామినేషన్లు దాఖలు చేశారు. అరుణ్ ధుమాల్ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ (పాలకమండలి) హెడ్‌గా ఉండనున్నాడు. అభిషేక్ దాల్మియా (జగ్మోహన్ దాల్మియా కొడుకు) ఐపీఎల్ పాలకమండలి సభ్యుడిగా, ఖైరుల్ జమల్ మజుందార్ అపెక్స్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉండనున్నారు' అని తెలిపాడు.

చక్రం తిప్పిన జైషా?

ఇక దాదాను తప్పించడంలో బోర్డు సెక్రటరీ జై షా పాత్ర ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. బోర్డు సాధించిన ఘనతలను తన క్రెడిట్‌గా చెప్పుకున్న జై షా.. వైఫల్యాలకు దాదా కారణమని బోర్డు సభ్యులను నమ్మించడంలో సఫలమయ్యాడు. కరోనా సమయంలో బయో బబుల్స్‌తో మూడు ఐపీఎల్ సీజన్లు నిర్వహించడం.. ప్రపంచకప్ టోర్నీని సక్సెస్ చేయడం వంటి ఘనతలతో పాటు ఐపీఎల్ మీడియా రైట్స్‌ను భారీ ధరకు అమ్మడంలో తనదే కీలక పాత్ర అని జై షా క్రెడిట్ కొట్టేశాడని గంగూలీ సన్నిహితుల వాదన. ఇక టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యానికి దాదానే కారణమని, జట్టు సెలెక్షన్‌లో అతని అతి జోక్యమే కొంపముంచిందని బోర్డు సభ్యులను నమ్మించాడు.

ఐసీసీ అధ్యక్ష పదవి కూడా...

అయితే బీసీసీఐ అధ్యక్ష పదవి దక్కకున్నా ఈ ఏడాది నవంబర్‌లో జరిగే ఐసీసీ అధ్యక్ష రేసులో నిలుద్దామనుకున్న దాదాకు నిరాశే ఎదురైంది. 'ఐసీసీ లేదు గీసీసీ లేదు. ఐపీఎల్ చైర్మన్‌గా ఉంటే ఉండు లేదంటే కోలకతాకు వెళ్లు..' అని బోర్డు అధికారులు కరాఖండీగా చెప్పినట్టు తెలిసింది.

దీంతో క్రికెట్‌లో అత్యున్నత పదవి చేపట్టాలనే ఆశ తీరకుండానే బెంగాల్ టైగర్ తప్పుకుంటున్నాడని అతడి అభిమానులు వాపోతున్నారు. దాదాకు బీసీసీఐ చైర్మెన్ గిరితో పాటు ఐసీసీ ఆశలు గల్లంతవడానికి కారణం జై షానే అని గంగూలీ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ రాజకీయాలకు బలి

కెప్టెన్‌గా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్)లో కీలక పదవులు అనుభవించిన దాదా ఆ తర్వాత తన పలుకుబడితో ప్రపంచంలోనే అత్యంత సంపన్న బోర్డులో చక్రం తిప్పాడు. బీసీసీఐ అధ్యక్షుడిగా ఒక పర్యాయం అధికారాన్ని అనుభవించిన దాదా.. రెండో దఫా కూడా తిరిగివస్తాడని అంతా భావిస్తుంటే గంగూలీకి ఊహించని షాక్ తగిలింది. బెంగాల్‌లో గంగూలీని కలుపుకుని అధికారం చేజిక్కించుకోవాలని చూసిన బీజేపీకి అతను సహకరించలేదు. 'నాకు రాజకీయాలు ఆసక్తి లేదు' అని పదేపదే చెప్పిన దాదా..చివరకు ఆ పార్టీ రాజకీయాలకే బలయ్యాడనే చర్చ జోరుగా సాగుతోంది. దీనిపై తృణముల్ కాంగ్రెస్ ఎంపీలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

కోహ్లితో గొడవ

ఇక టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లితో దాదాకు ఉన్న బేధాభిప్రాయాలు కూడా అతన్ని తప్పించడానికి ప్రధాన కారణమయ్యాయి. కెప్టెన్సీ నుంచి తప్పించే విషయంలో దాదా చేసిన వ్యాఖ్యలు, దానికి కోహ్లీ కౌంటరివ్వడం బోర్డు ప్రతిష్ఠను దిగజార్చాయి. ఈ ఘటనలనే ఎత్తి చూపుతూ బోర్డు సభ్యులు దాదాపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రపంచకప్ జట్టుకు టీమ్ మెంటార్‌గా ధోనీని ఎంపిక చేయడం, రవిశాస్త్రితో ఉన్న బేధాభిప్రాయాల నేపథ్యంలో దాదా జట్టు సెలెక్షన్‌లో జోక్యం చేసుకోవడం వంటివి బోర్డు సభ్యులకు నచ్చలేదని సమాచారం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.